

గోదావరి డెల్టా కాలువలు, డ్రెయిన్ల పరిస్థితిపై లైడార్ సర్వే
ఇరిగేషన్ అధికారులతో మంత్రి నిమ్మల సమీక్ష.. 6లో

తృటిలో తప్పిన ప్రమాదం
స్కూల్ బస్ బోల్తా.. విద్యార్థులకు గాయాలు.. 7లో



దిగజారిన కొబ్బరి ధర!

ప్రస్తుత ధర రూ.10
దిగుబడులూ అంతే

పెరవలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొబ్బరి ధర దిగజారడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరకాలంగా పెరుగుతూ వచ్చిన కొబ్బరి ధర ఒక్కసారిగా సగానికి సగం పడిపోయిందని వాపోతున్నారు. రెండు సంవత్సరాల కిందట కేవలం ఐదారు రూపాయలు మాత్రమే పలికిన కొబ్బరి ధర క్రమంగా పెరుగుతూ పది రూపాయలకు చేరుకుంది. అక్కడి నుంచి ప్రతీ రెండు నెలలకు నాలుగు రూపాయల చొప్పున పెరుగుతూ రూ.20 వరకు వెళ్లింది. అంతేగాకుండా వ్యాపారులు రైతుల చెట్ల వద్దకు వచ్చి వారే స్వయంగా ఖర్చులు భరించి కొబ్బరికాయలు దించుకుని రైతులకు సొమ్ములు చెల్లించేవారు. అయితే కొద్దిరోజులుగా 20 రూపాయలు ఉన్న ధర ఒక్కసారిగా పది రూపాయలు దిగజారిందని రైతులు వాపోతున్నారు. దీంతో నిల్వ లుపెట్టిన వ్యాపారులు కూడా లక్ష రూపాయలు మేర నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రేటు బాగుండి కాయలు దిగుబడి కూడా ఉండేదని, ప్రస్తుతం రేటు తగ్గడమేకాకుండా కొబ్బరికాయల దిగుబడి కూడా తగ్గిపోయిందని చెబుతున్నారు. ఎకరానికి 1500 కాయలుపైగా పడేవని ప్రస్తుతం ఏడెనిమిది వందలు మాత్రమే పడుతున్నాయని పేర్కొంటున్నారు. ప్రస్తుతం పెద్దగా శుభకార్యాలు లేకపోవడం, పండుగలు లేకపోవడం దీనికి కారణంగా చెబుతున్నారు. వచ్చే సంక్రాంతి, శివరాత్రి నాటికి తిరిగి కొద్ది మేర అయినా ధర పెరగొచ్చని చెబుతున్నారు.

25న అటల్ బిహారీ వాజ్‌పేయి సుపరిపాలన డే

21న రాజమహేంద్రవరంలో భారీ బహిరంగ సభ : నల్లమిల్లి



విలేకరులతో మాట్లాడుతున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మదినం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈనెల 25న అటల్ సుపరిపాలన డేగా ప్రకటించిందని, ఈనెల 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ ఆయన శతజయంతి యాత్ర కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన రాజమహేంద్రవరంలో భారీ బహిరంగ సభ జరుగుతుందని, వివరాలు త్వరలో తెలియజేస్తామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పాల్గొన్నారు.

ఇంత 'చిన్న' చూపేంటి?



కుమారదేవం పంపింగ్ స్కీమ్

- ఉమ్మడి జిల్లాల్లో చిన్ననీటి పారుదల వ్యవస్థ నిర్వీర్యం
- పదేళ్లుగా రిపేర్లకూ నిధులివ్వని వైనం
- ఏజెన్సీ ఎత్తిపోతల పథకాలన్నీ దాదాపుగా మూత
- నిర్వహణ బాధ్యత కార్పొరేట్‌కు అప్పగించే యోచన
- ఆ మేరకు రూ.600 కోట్లతో ఇప్పటికే ప్రతిపాదనలు
- ఇది అమలైతే వేల ఎకరాలకు పుష్కలంగా సాగునీరు
- అయినా రోజులు గడుస్తున్నా ముందుకు కదలని వైనం

గోదావరి జిల్లాలో నీరు పుష్కలంగా ఉంటుందనేది చాలామంది అభిప్రాయం. కానీ ఇక్కడా మెట్ట ప్రాంతం ఉంది. అటు కాలువల నీరూ, ఇటు బోరు నీరు కూడా లభ్యంకాని పొలాలు వేలాది హెక్టార్లలో ఉన్నాయి. వీటిని సాగు చేయడానికి గతంలో ఏర్పాటుచేసిన చిన్న నీటిపారుదల వ్యవస్థ నిర్వీర్యమై పోయింది. ముఖ్యంగా గత వైసీపీ హయాంలో పైసా విదల్చలేదు. దీంతో మొత్తం చిన్న నీటిపారుదల వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తమైపోయింది. దీన్ని సరిదిద్ది, ఆయా ఎత్తిపోతల పథకాలకు జీవం పోసేందుకు ప్రభుత్వం దృష్టిపెట్టింది. అయితే అవి ప్రతిపాదనల దశ దాటకపోవడం అన్నదాతలకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది.



కాటవరం పంపింగ్ స్కీమ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కాలువల ద్వారా నీటి సరఫరా లేని మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యవసాయం చేయడంకోసం 1974లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల సంస్థ (ఏపీఐడీ) ఏర్పడింది. ఇది ప్రధానంగా ఎత్తిపోతల పథకాల ఏర్పాటు, నిర్వహణ కోసం పనిచేస్తోంది. కనీసం 50 ఎకరాల నుంచి 5 వేల ఎకరాల వరకూ ఉన్న భూముల కోసం ప్రభుత్వం ఒక్కొక్క ఎత్తిపోతల పథకం నిర్మించి రైతులకు అప్పగించింది. ముఖ్యంగా గోదావరి, కాల్వలు, డ్రైన్ల నుంచి నీటిని ఎత్తిపోసి పంటలు పండించడానికి చిన్నచిన్న ఎత్తిపోతల పథకాలను నిర్మించింది. వాటికి ఉచిత కరెంట్ ఇచ్చేది. ఇక వాటి నిర్వహణ, తూడు, డీసిల్టేషన్, చిన్నచిన్న రిపేర్లు వంటివి రైతులు చేసుకోవాలి. దీనికోసం 11 మందితో రైతు కమిటీ ఉంటుంది. రైతుల నుంచి ఎకరాకు రూ.500 నుంచి 1000 వరకూ ఏడాదికి వసూలుచేసి ఎత్తిపోతల పథకాలను మెయింటెనెన్స్ చేస్తారు. పూర్తి మరమ్మతులు వస్తే ప్రభుత్వమే బాగు చేయిస్తుంది. పదేళ్ల నుంచి పాలకులు వీటిపై పెద్దగా దృష్టి పెట్టలేదు. నిర్వహణకు ఇబ్బంది లేకుండా కొంత సాయం అందించి చేతులు దులిపేసుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వీటికోసం పైసా విదల్చలేదు. దాంతో కొన్ని ఎత్తిపోతల పథకాలు మూతపడ్డాయి. మరమ్మతులు లేక ఆ ఎత్తిపోతల ఆయకట్టులో సాగు నిలిచిపోయింది.

ఎక్కడెక్కడ.. పంపింగ్ స్కీములెన్ని..

మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో చిన్న, మధ్యతరహా ఎత్తిపోతల పథకాలు గోదావరి జిల్లాల్లో పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 101 పంపింగ్ స్కీమ్‌లుండగా, వాటి పరిధిలో 37,450 ఎకరాల ఆయకట్టు ఉండేది. దీంట్లో పోలవరం ప్రాజెక్టు ముంపు వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో 50 ఎత్తిపోతల పథకాలు పనిచేయకుండాపోగా, మరో 20 ఎత్తిపోతల పథకాలు నిర్వీర్యమయ్యాయి. కొంతకాలం వీటిని మైక్రో ఇరిగేషన్ డెవలప్మెంట్ సంస్థ తన అధీనంలో నిర్వహించినా, ఏజెన్సీ ప్రజల్లో స్పందన లేదనే కారణంతో ఇది కూడా వదిలేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 35 స్కీమ్‌లు ఉండగా, అందులో ఆరింటింటిని మొత్తం తొలగించారు. ఇక 29 స్కీమ్‌ల కింద 55,113 ఎకరాల ఆయకట్టు ఉంది. అందులో కొన్ని ఎకరాలకు మాత్రమే నీటిసరఫరా అవుతోంది. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో కాటవరం, కుమారదేవం, వేగేశ్వ రపురం, పైడిమెట్ట, చాగల్లు బ్రాహ్మణగూడెం వంటివి మాత్రం ఓ మాదిరిగా పనిచేస్తున్నాయి. వేములవాడ -1,2, పెదపూడి, పల్లిపాలెం-1,2, పనిచేస్తున్నాయి. మిగతా ప్రాంతాల్లో రిపేర్లకు గత పదేళ్ల నుంచి పాలకులు నిధులు ఇవ్వకపో వడంతో ఎక్కడివక్కడ చతికిలపడ్డాయి. 2016లో తెలుగుదేశం ప్రభుత్వం ఈ వ్యవస్థ బతికించడానికి కొంత ప్రయత్నం చేసింది. కొత్త ఎత్తిపోతల పథకాలను కూడా ప్రతిపాదించింది. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ వీటి విషయం పూర్తిగా పక్కన పెట్టేసింది. రైతుల చొరవ వల్ల నామ మాత్రంగా కొన్ని ఉనికిని కాపాడుకుంటున్నాయి. ఇటీవల రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపినప్పటికీ మొల్లేరు- గోవిందపురం- మల్లవరం స్కీమ్ పనులు ఇంతవరకు చేపట్టలేదు. ఇది కొత్త స్కీమ్. గతంలో 22 శాతం పని జరిగి ఆగింది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో పది చిన్నఎత్తిపోతల పథకాలు ఉండగా, ఇవి పాక్షికంగా పనిచేస్తున్నాయి. అందులో కొవ్వూరు నియోజకవర్గంలో కుమారదేవం, బ్రాహ్మణగూడెం, చాగల్లు, వేగేశ్వరపురం, పైడిమెట్ట-1, నిడదవోలు స్కీమ్‌లు ఉండగా అనపర్తిలో పి.బి.దేవం-1,2, కాపవరం, రాజానగరం నియోజకవర్గంలోని కాటవరం ఉన్నాయి. ఇక్కడ మొత్తం 23,745 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి రిపేర్లకు రూ.4815.50 లక్షలు. నిర్వహణకు రూ.14745 లక్షలు.. మొత్తం రూ.195 కోట్ల 60 లక్షల 50 వేలతో అంచనాలు పంపించారు. కాకినాడ జిల్లాలో అత్యధికంగా 14 స్కీమ్‌లు ఉన్నాయి. వాటిలో పెద్దాపురం నియోజకవర్గంలోని వేట్లపాలెం, కట్టమూరు, కట్టమూరు మినీ, పెద్దాపురం-1, పెద్దాపురం-2, జి.మేడపాడు, పెదబ్రహ్మదేవం-3, కాకినాడ రూరల్‌లో వేములవాడ-2, పెద్దపురపాడు, గొర్రిపూడి, వేములవాడ- అనపర్తి నియోజకవర్గం పరిధిలోని పెదపూడి, దోమాడ, జగ్గంపేట నియోజకవర్గంలోని సోమవరం పథకాలున్నాయి. ఇక్కడ 13,710 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి రిపేర్లు, నిర్వహణకు రూ.122 కోట్ల 25 లక్షల 32 వేలు అంచనా వేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5 పథకాలు ఉన్నాయి. అవి రాజోలు నియోజవర్గంలోని చింతలమోరి, కొత్తపేట నియోజకవర్గంలోని వసంతవాడ, ఉచ్చిలి పథకాలు. ఇక్కడ మొత్తం 4,970 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి రిపేర్లు, నిర్వహణకు రూ.34 కోట్ల 8 లక్షల 37 వేలతో అంచనాలు సిద్ధంచేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పల్లిపాలెం-1,2 పథకాల్లో 927 ఎకరాల ఆయకట్టు ఉంది. రిపేర్లు, మెయింటెనెన్స్ కోసం రూ.3 కోట్ల 48 లక్షలతో అంచనాలు సిద్ధం చేశారు.

● 49 స్కీమ్‌లు.. రూ.600 కోట్లు

తెలంగాణలో కాకతీయ మిషన్ మాదిరిగా ఓ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థకు మరమ్మతులు, నిర్వహణ బాధ్యత అప్పగించే ఆలోచన ప్రభుత్వం వద్ద ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే వీటి మరమ్మతులకు సంబంధించి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని మొత్తం ఎత్తిపోతల పథకాలను వదిలేసి,మెట్ట ప్రాంతంలోని ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులతోపాటు ఐదేళ్లపాటు నిర్వహణ చేయడానికి ఓ కార్పొరేట్ సంస్థకు అప్పగించే విధంగా ప్రతిపాదనలు సిద్ధచేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 49 ఎత్తిపోతల పథకాలకు మొత్తం రూ.600 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు.





విభిన్న ప్రతిభావంతులకు క్రీడల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి.. తొలుత పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నగర కమిషనర్ రాహుల్ మీనా

విభిన్న ప్రతిభావంతుల్లో అపారమైన సృజనాత్మకత

క్రీడా పోటీల బహుమతి ప్రదానోత్సవ సభలో కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లల్లో అపారమైన సృజనాత్మకత, ప్రత్యేక కౌశలాలు దాగి ఉంటాయని, వారికి సరైన వేదిక, తగిన అవకాశాలు కల్పిస్తే ఏ స్థాయి విజయాలనైనా అందుకుంటారని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విభిన్న ప్రతిభావంతులకు క్రీడలు నిర్వహించారు. ఈ పోటీలను ఉదయం నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా జెండా ఊపి ప్రారంభించగా, సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో నమ్మకం, ధైర్యం, ప్రతిభను వెలికితీయడంలో క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, శిక్షణ, మార్గదర్శకతను అవగాహనతో వినియోగించుకోవాలని సూచించారు. శారీరక పరిమితులు ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో ప్రయత్నం చేయడం నిజమైన బలం, పోటీల్లో పాల్గొనడం నిజమైన విజయం అని పేర్కొన్నారు. కమిషనర్ రాహుల్‌మీనా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలకు అండగా నిలుస్తాయన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు మాట్లాడారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రబీ సీజన్‌కు ఎరువుల కొరతలేదు

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సీజన్ మొదలైందని, ఎరువుల కొరతలేదని, పుష్కలంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రబీలో మొత్తం 60వేల హెక్టార్లలో వరి పంట సాగుకు ప్రణాళిక రూపొందించామని, సుమారు 40 వాతం వెదజల్లే విధానంలో సాగు ఉంటుందన్నారు. ఇప్పటివరకూ రాజానగరం మండలంలో 70 హెక్టార్లలోనూ, కొవ్వూరు డివిజన్‌లోనూ నారుమళ్లు వేసినట్టు చెప్పారు. రబీ పంటల కోసం జిల్లాలో అన్ని రకాల ఎరువులు కలిపి 1,15,000 మెట్రిక్ టన్నులు అవసరం కాగా, ఇప్పటివరకూ 37 వేల మెట్రిక్ టన్నులు సరఫరా చేసినట్టు తెలిపారు. యూరియా 16 వేలు మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా, ప్రస్తుతం 8వేలు మెట్రిక్ టన్నులు అందుబాటు ఉందని, రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా నిల్వ చేసినట్టు తెలిపారు. విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నట్టు చెప్పారు.



నిడదవోలు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి : జిల్లా ఎస్పీ

నిడదవోలు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో తనిఖీలు

నిడదవోలు, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు అధికారులు సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించాలని, ఎక్కడైనా పోలీస్ స్టేషన్లో ఎవరైనా అవినీతికి పాల్పడితే తమ దృష్టికి తీసుకువస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన తనిఖీ నిర్వహించారు. ముందుగా పోలీసు వందనం స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో రాజమండ్రి నిడదవోలు, కొవ్వూరులలో రాత్రివేళలో గస్తీ పెంచామని, దీనిద్వారా దొంగతనాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. పట్టణ ప్రాంతాల్లో బ్లూ కోర్ట్ వాహనాలు మరిన్ని కేటాయిస్తున్నామన్నారు. జిల్లాకు త్వరలో శిక్షణ ముగించుకుని కానిస్టేబుళ్లు రానున్నారని, దీంతో సిబ్బంది కొరత తగ్గుతుందని తెలిపారు. జిల్లాలో లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం పై పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలను చైతన్యపరచవలసిన బాధ్యత ఉందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం వినియోగంపై ప్రజలు అవగాహన కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెరవలి హైవేపై ఎదురు వచ్చే ద్విచక్ర వాహనాల ద్వారా ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించామని, వీటి నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. నిడదవోలు పట్టణ పరిధిలో మరిన్ని సీసీ కెమెరాలు పెంచడం, వాటిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు, జిల్లా కంట్రోల్ రూమ్‌కు అనుసంధానానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట డీఎస్పీ జి.దేవకుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ ఉన్నారు.

స్పార్క్ కార్యక్రమంతో ఆవిష్కర్తలకు దిశానిర్దేశం



ఆర్‌టీఐహెచ్‌లో స్టార్టప్ ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ మేఘస్వరూప్

- జేసీ మేఘస్వరూప్
- ఆర్టీఐహెచ్‌లో ప్రారంభమైన బూట్ క్యాంప్ కార్యక్రమం

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): బొమ్మూరులోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ మూడురోజులపాటు నిర్వహించే స్పార్క్ (స్పెషలైజ్డ్ ప్రోగ్రామ్ ఫర్ అడ్వాన్స్‌డ్ అండ్ రియల్‌టైమ్ నాలెడ్జ్) కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ మేఘస్వరూప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 9 నుంచి 12 వరకు ఏర్పాటుచేసిన ఈ బూట్ క్యాంప్ యువతలో ఆవిష్కరణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కారం, స్టార్టప్ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా రూపొందించబడిందన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రిన్యూర్ అన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి, రతన్‌టాటా ఇన్నోవేటివ్ హబ్ దృష్టికోణానికి. స్పార్క్ కార్యక్రమం కీలక వేదికగా నిలుస్తుందన్నారు. సమస్యలు గుర్తించడం నుంచి ప్రొటో టైప్ అభివృద్ధి వరకు యువతకు మార్గ నిర్దేశం చేసే సామర్థ్యం ఈ కార్యక్రమానికి ఉందన్నారు. తొలి సెషన్‌లో సమస్య నిర్వచనం, కస్టమర్ సెగ్మెంట్ల గుర్తింపు, ప్రాక్టికల్ సొల్యూషన్లు, బ్రెయిన్ స్టార్మింగ్ అంశాలపై చర్చ జరిగింది. కార్యక్రమ లక్ష్యాలు, దిశా దృక్పథం, ఆవిష్కరణల అవకాశాలను ఆర్‌టీఐహెచ్ నోడల్ అధికారి టి సూర్యప్రకాష్ వివరించారు. రీజనల్ సెంటర్ పరిధిలోని స్టార్టప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంవోయూ ద్వారా జిల్లా హార్టీకల్చర్ రంగంలో నూతన అధ్యాయానికి ఆవిష్కరణ

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



యూనివర్సిటీతో ఒప్పందం చేసుకుంటున్న కలెక్టర్, అధికారులు

రాజమహేంద్రవరం రూరల్ డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల్లో సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించేవిధంగా చర్యలు చేపడుతున్నామని, అందులోభాగంగా హార్టీకల్చర్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్టు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం గ్రామంలోని డాక్టర్ వైఎస్ఆర్ హార్టీకల్చర్ యూనివర్సిటీలో, రూరల్ మండలం బొమ్మూరులో గల రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్ సంయుక్తంగా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికోసం ఒక ముఖ్యమైన ఒప్పందం కుదుర్చుకొనే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో యూనివర్సిటీ శాస్త్రవేత్తలతో పాటు జిల్లా పారిశ్రామిక అధికారి శ్రీవనిధర్ రామన్, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, జిల్లా హార్టీకల్చర్ అధికారి మల్లిఖార్జునరావు, ఆర్‌టీఐహెచ్ నోడల్ అధికారి సూర్యప్రకాష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల సమయం దగ్గరపడుతోంది. పదో తరగతి పరీక్షలు రాసేందుకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. జిల్లా విద్యా శాఖ వంద రోజుల ప్రణాళికతో వారిని సంసిద్ధం చేస్తోంది. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇదిలా ఉంటే దేశవ్యాప్తంగా బోర్డు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులతో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడనున్నారు. కేంద్ర మానవవనరుల శాఖ ఏటా 'పరీక్షా పే' చర్చ నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో పరీక్షలంటే భయం పోగొట్టేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి?, విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్లు, వాటిని ఎలా అధిగమించాలి? పరీక్షల సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి వంటి విషయాలపై ఈ 'పరీక్షా పే' చర్చ జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు 6 నుంచి 12 తరగతుల విద్యార్థులు అర్హులు. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులతో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడతారు. వారి అభిప్రాయాలను తెలుసుకుంటారు.


హలో పీఎం జీ...

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పరీక్షా పే చర్చ 2018 ఫిబ్రవరి 16న ఢిల్లీలో ప్రారంభమైంది. అప్పట్లో తాల్కతోరా స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు నేరుగా ప్రధాని మోదీతో సంభాషించారు. ఇప్పుడు కూడా విద్యార్థులు తమ ప్రశ్నలను ప్రధానమంత్రిని నేరుగా అడగవచ్చు. ప్రశ్న గరిష్ఠంగా 500 అక్షరాలలోపు ఉండాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పాల్గొనవచ్చు. వారి ఎంట్రీలకు కూడా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అవకాశం కల్పించింది. ప్రస్తుతం తొమ్మిదో ఎడిషన్‌కు సన్నద్ధమవుతోంది.

ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 'పరీక్షా పే' చర్చ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు https://innovateindia.mygov.in క్లిక్ చేయాలి. ఎంటర్ కాగానే క్లిక్ ఏజ్ స్టూడెంట్, టీచర్, పేరెంట్స్ అనే లాగిన్స్ కనిపిస్తాయి. వాటిలోకి ఎంటర్ కాగానే మీ మొబైల్ నెంబరు లేదా జీ-మెయిల్ ఖాతాను పూర్తిచేయాలి. ఓటీపీతో లాగిన్ అయి క్లిక్ చేయాలి. ఓటీపీ రాగానే మళ్లీ లాగిన్ చేయాలి. నేరుగా ఫోను నంబరు, జీ-మెయిల్ లేని స్టూడెంట్స్ టీచర్స్ లాగిన్ ద్వారా ఎంటర్ కావొచ్చు. ప్రాథమిక సమాచారం వివరాలను పూర్తి చేయాలి. తర్వాత థీమ్‌ను ఎంచుకుని 500 అక్షరాలలోపు వివరించాలి. అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పరీక్షా పే చర్చలో పాల్గొనేలా డీవైఈవోలు, ఎంఈవోలు కృషి చేయాలి. చర్చకు ఎంపికైన సుమారు రెండువేల మందికిపైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా పీపీసీ కిట్లు అందజేయనున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు జనవరి 11 తుది గడువు.

పరీక్షా పే చర్చలో పాల్గొనే విద్యార్థులు ఎవరైతే మంచి ప్రశ్నలు వేస్తారో వారిని అర్హులుగా నిర్ణయిస్తారు. విజేతలు నేరుగా ప్రధాని మోదీని కలిసే అవకాశం ఉంటుంది. ప్రతి విజేతకు ప్రత్యేక కిట్, ప్రత్యేకంగా రూపొందించిన ప్రశంసాపత్రం అందజేస్తారు. ప్రధానమంత్రి ఆటోగ్రాఫ్, ఫొటోతో కూడిన డిజిటల్ సావనీర్ కూడా ఇస్తారు.







- విద్యార్థులకు ప్రధాని మోదీతో మాట్లాడే అవకాశం
- 'పరీక్షా పే' చర్చ పేరుతో త్వరలో కార్యక్రమ నిర్వహణ
- ఈ నెల ఒకటిన మొదలైన ఆన్‌లైన్ నమోదు
- జనవరి 11తో ముగియనున్న గడువు

చక్కని అవకాశం

పి.రమేష్, డీఈవో, కాకినాడ జిల్లా



ప్రధాని నరేంద్ర మోదీతో విద్యార్థులు మాట్లాడే అరుదైన కార్యక్రమమిది. పరీక్షా పే చర్చలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. 6-12 తరగతుల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఇది చక్కని అవకాశం. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా కృషి చేయాలి.

క్రీడా సంరంభం

- కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నేటి నుంచి సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ టోర్నమెంటు
- నాలుగు పూల్స్‌గా విభజన
- కాకినాడ జిల్లాలో మూడుచోట్ల ఆరు కోర్టుల్లో నిర్వహణ
- ఆరు రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 138 జట్లు
- ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్న ప్రభుత్వ విప్ గణబాబు



జేఎన్టీయూ మైదానంలో ముస్తాబవుతున్న వేదిక

జేఎన్టీయూకే, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయూ) న్యూఢిల్లీ సహకారంతో సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ పోటీలను ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్‌ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఈ టోర్నమెంటులో సుమారు 138 జట్లు పాల్గొంటున్నాయన్నారు. నాలుగు పూల్స్‌గా విభజించామన్నారు. పూల్ ఎ, బి-జేఎన్టీయూకే మైదానంలో, పూల్ సి-అచ్చంపేటలోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ క్యాంపస్‌లో, పూల్ డి-సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతాయి. ఆరు రాష్ట్రాలకు చెందిన 1,960 మంది క్రీడాకారులు, 300 మంది కోచ్‌లు, మేనేజర్లు, 60 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు అఖిల భారత స్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయి. పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వాలీబాల్ టోర్నమెంటును ప్రభుత్వ విప్, విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే, ఏపీ వాలీబాల్ సంఘం అధ్యక్షుడు, వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు పి.గణవెంకట రెడ్డినాయుడు (గణబాబు) ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారు. విశిష్ట అతిథులుగా అర్జున అవార్డు గ్రహీత, అంతర్జాతీయ వాలీబాల్ మాజీ క్రీడాకారుడు పి.వెంకటరమణ, ఏఐయూ పరిశీలకుడు డాక్టర్ ఈ.త్రిమూర్తులు, గౌరవ అతిథులుగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ గరికపాటి బిందుమాధవ్ పాల్గొంటారు.



వివరాలు వెల్లడిస్తున్న జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్‌ఆర్కే ప్రసాద్

విజేత, రన్నరప్, 3, 4 స్థానాల్లో నిలిచే జట్లకు బహుమతులు అందజేస్తారు. లీగ్ మ్యాచ్‌ల్లో అర్హత సాధించిన జట్లకు జేఎన్టీయూ మైదానంలో పోటీలు నిర్వహిస్తారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు జైపూర్‌లోని మణిపాల్ యూనివర్శిటీలో జరిగే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ టోర్నీలో పాల్గొంటాయని శ్యామ్‌కుమార్ తెలిపారు.

వాలీబాల్ టోర్నమెంటుకు జేఎన్టీయూకే వీసీ అధ్యక్షత వహించనుండగా డైరెక్టర్లు కృష్ణమోహన్, రాము కార్యనిర్వాహక కమిటీ అధికారులుగా వ్యవహరిస్తారని విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి, టోర్నమెంటు కన్వీనర్ డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. కార్యనిర్వాహక కార్యదర్శిగా డాక్టర్ జీపీ రాజు వ్యవహరిస్తున్నారు.

● ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలకు చెందిన 138 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. వాలీబాల్ మ్యాచ్‌లు నాలుగు రోజుల పాటు నాలుగు కోర్టుల్లో జరుగుతాయి. పోటీలు ఉదయం ఆరు గంటలకు, మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతాయి. జేఎన్టీయూకే మైదానంలోని ఫ్లడ్‌లైట్ కోర్టులు 1, 2, రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ క్యాంపస్‌లోని కోర్టులు 3, 4, సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలోని కోర్టులు 5, 6ల్లో మ్యాచ్‌లు జరుగుతాయి.



టోర్నీలో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు





కాకినాడ జేఎన్టీయూ మైదానంలో సిద్ధం చేసిన వాలీబాల్ కోర్టు, క్రీడాభిమానులు కూర్చుని వీక్షించేందుకు ఏర్పాటుచేసిన గ్యాలరీ

గ్రామీణ భారత్ ఉన్నతికి పీఎంజీఎస్‌వై దోహదం

- కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్
- ప్రధానమంత్రి గ్రామ సడక్‌యోజన 25 వసంతాల వేడుకలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

జేఎన్టీయూకే, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచి గ్రామీణ భారత్ ఉన్నతికి ప్రధానమంత్రి గ్రామ సడక్‌యోజన(పీఎంజీఎస్‌వై) ఎంతగానో ఉపయోగపడిందని కాకినాడ కలెక్టర్ ఎస్.షాన్‌మోహన్ అన్నారు.కాకినాడ జేఎన్టీయూ అలూమ్ని ఆడిటోరియంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ జేఎన్టీయూ సహకారంతో రెండు రోజులపాటు నిర్వహించే సాంకేతిక సెమినార్ మంగళవారం ప్రారంభమైంది. పీఎంజీఎస్‌వై ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తు న్న ఈ సెమినార్‌ను కలెక్టర్‌తోపాటు జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్‌ఆర్కే ప్రసాద్, పీఆర్ చీఫ్ ఇంజనీర్ బి.బాలునాయక్, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ప్రారంభించిన రోడ్లను, ఇతర ప్రాజెక్టులను ఇప్పుడు తిరిగి పరిశీలించాలన్నారు.వీసీ ప్రసాద్ మాట్లాడుతూ తాను వరంగల్ ఆర్ఈసీగా ఉండగా రాష్ట్ర సాంకేతిక ఏజెన్సీ ద్వారా వేల కిలోమీటర్లమేర గ్రామీణరోడ్లకు సాంకేతిక సహకారం అందించామన్నారు. బాలునాయక్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో అప్పటి దేశ ప్రధాని వాజ్‌పేయి పుట్టినరోజు సందర్భంగా పీఎంజీఎస్‌వై ప్రారంభమైందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈలు ఏవీఎస్ శ్రీనివాస్, పి.రామకృష్ణ, బాలకృష్ణ, పృథ్వీరాజ్, ఏపీపీఆర్‌డీ ఇంజనీర్లసంఘ సభ్యులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పీసా చట్టంపై శిక్షణ

సామర్లకోట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో పీసా చట్టంపై శిక్షణ తరగతులను కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో మంగళవారం నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 80మంది ఎంపీడీవోలు హాజరయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ మాట్లాడు తూ షెడ్యూల్డు ప్రాంతాల్లో పరిపాలన మరింత మెరుగుపడేలా శిక్షణను సద్వినియోగం చేసుకుని క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు సాధించాలన్నారు.ఎంపీడీవో సుశీల, ఫ్యాకల్టీ సభ్యులు చిన్నబ్బులు, నీహారిక, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కేశవస్వామి ఆలయంలో పవిత్రోత్సవ పూజలు

ఆత్రేయపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా తొలిరోజు మంగళవారం గోపూజ, గోప్రదక్షిణ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణ, దీక్షాధారణ, స్వామివారికి సప్నపనం, అకల్మష హోమాన్ని వేద పండితులు నిర్వహించారు. మంగళవాయిద్యాలతో పుట్టమట్టిని తీసుకొచ్చారు. యాగశాలలో అంకుర్పారణ, వాస్తుపూజ, శాంతిహోమం నిర్వహించారు.ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు దంపతులు,ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి దంపతులు పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

పోర్టు రంగంలో భారీ సంస్కరణలు

వన్ నేషన్-వన్ పోర్ట్ ప్రోసెస్ అమలుతో

రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్‌బాబు



కాకినాడ సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా వన్ నేషన్ వన్ పోర్ట్ ప్రోసెస్(ఓఎన్ఓపీ) అమ లుతో పోర్టు రంగంలో భారీ సంస్కరణలు జరగనున్నాయని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు అన్నారు. ఈ అంశంపై మంగళవారం రాజ్యసభలో ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర పో ర్టులు, షిప్పింగ్, జల మార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ స్పందించారు. దేశవ్యాప్తంగా పోర్టుల పనితీరు, డిజిటల్ వ్యవస్థలు, నియంత్రణ ప్రక్రియలను ఏకరీతిలో అమలు చేయడమే ఈ ఫ్రేమ్‌వర్క్ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. ఓఎన్‌ఓపీ అభివృద్ధి, అమలుపై ఆయన స్పష్టతనిచ్చారు.ఈ చర్యలతో అన్ని పోర్టుల్లో సమాన ప్రామాణీకరణను అందించడంతో పాటు లాజిస్టిక్స్ రంగంలో పారదర్శకతను పెంచుతాయన్నారు. ముఖ్యంగా నేషనల్ లాజిస్టిక్స్ పోర్టల్(సాగర్ సేతు)ను అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. అన్ని పోర్టుల్లో షిప్పింగ్ సంబంధిత సమాచారాన్ని ఎలక్ట్రానిక్స్‌గా సజావుగా సమర్పించడం, ప్రాసెసింగ్ చేయడం కోసం ఈ వేదికను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.ఈ వేదికపై కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్, పోర్ట్ హెల్త్ ఆర్గనైజేషన్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ వంటి కీలక విభాగాలను ఒకే చోట అనుసంధానిస్తామని చెప్పారు.ఈ సంస్కరణలు పారదర్శకంగా, సమానంగా అమలవుతాయని, దేశంలోని ప్రతి పోర్టుకు ఆంధ్రప్రదేశ్ పోర్టులను కలుపుతూ ఈ ఫ్రేమ్ వర్క్ కొనసాగుతుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. దీనిపై ఎంపీ సతీష్‌బాబు మీడియాతో మాట్లాడుతూ ఈ విధానం వల్ల పోర్టు మౌలిక వసతుల్లో, డిజిటల్ సేవల్లో, కార్గో హ్యాండ్లింగ్ వ్యవస్థలో ఏకరూపత నెలకొని రాష్ట్ర పోర్టులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.

మనుగడకు రక్షణ

మడ అడవులతో మానవాళి

కోరింగ ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్



మడ అడవుల విశిష్టతను వివరిస్తున్న రేంజర్ వరప్రసాద్

తాళ్లరేవు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు మడ అడవులు రక్షణ గోడలా నిలుస్తున్నాయని కోరింగ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండల పరిధిలోని కోరింగ అభయారణ్యాన్ని రాజమహేంద్రవరం అటవీ శాఖలో శిక్షణ పొందుతున్న 12, 13 బ్యాచ్‌ల ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవో ట్రైనీలు సందర్శించారు. వారికి మడ అడవుల విశిష్టత, వన్యప్రాణుల సంరక్షణ, సముద్ర తాబేళ్లు, సీబీఈటీ ప్రాముఖ్యతలను ఎఫ్‌బీవో మహేష్ వివరించారు. కార్యక్రమంలో అటవీ అకాడమీ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరెడ్డి, సబ్ డీఎఫ్‌వో బి.శ్రీరామారావు, ఎఫ్‌బీవోలు మహేష్, డి.మహేష్‌బాబు, సీబీఈటీ సిబ్బంది పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయ చైర్మన్‌గా వెంకట్రాజు



ఆత్రేయపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా ముదునూరి వెంకట్రాజు నియమితులయ్యారు. ఆలయానికి 17 మంది సభ్యులతో పాలక మండలిని నియమిస్తూ దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్ ఉత్తర్వులు జారీచేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సిఫార్సు మేరకు ఆత్రేయపురం క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన వెంకట్రాజును చైర్మన్‌గా నియమించారు. నియోజకవర్గానికి చెందిన 10 మంది ధర్మకర్తలను ప్రభుత్వం నియమించగా మరో ఏడుగురిని రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన వారితో పాటు తెలంగాణాకు చెందిన ఓ వ్యక్తికి స్థానం కల్పించారు. ధర్మకర్తలుగా చలుమూరి రాంబాబు,గంగవరపు పద్మావతి,కాసా చాముండేశ్వరి, కొల్లుబోయిన శ్రీనివాసరావు, పెండెం కుమారి, పెండ్యాల భవాని, సలాది నాగేశ్వరరావు, సరెళ్ళ సరిత, యేపుగంటి విజయకుమారి, చింతపల్లి సత్యనారాయణ, తమ్మన సాయిప్రసాద్, యల్లమిల్లి చంద్రకుమారి,కొండపల్లి రామచంద్రరావు, శిష్టా సూర్యకుటుంబరావు, దాలిపర్తి శ్రీలక్ష్మి, గోశాల అప్పలనర్స, అర్చక ఎక్స్‌అఫీషియోగా వాడపల్లి సుందర శేషావతారం నియమితులయ్యారు. నూతన పాలక మండలి త్వరలోనే కొలువుదీరనుంది.

డెల్టా కాలువలు, డ్రెయిన్లపై లైడార్ సర్వే

మే నెలలోపు రిపోర్టు.. రూ.13.4 కోట్లతో ఐఐసీటీతో ఒప్పందం: మంత్రి నిమ్మల

రాజమహేంద్రవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డెల్టా పంటను ముంపు బారి నుంచి తప్పించే ప్రయత్నాలను ప్రభుత్వం వెతకడం మొదలు పెట్టింది. కాలువల్లో పూడిక, డ్రెయిన్లు సరిగ్గా లేకపోవడం వల్లే ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని ఏటా పంట ముంపునకు గురవుతుందని ఆలోచనకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారంపై దృష్టి సారించింది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో అమరావతిలో మంగళవారం ఇరిగేషన్ అధికారుల సమీక్ష జరిగింది.ఇరిగేషన్ సలహాదారు ఎం.వెంకటేశ్వరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, డెల్టా సీఈ శేషబాబు, ఎస్ఈ గోపీనాథ్, ఏలూరు ఎస్ఈ దేవప్రసాద్, ఈఈలు తదితరులతో ఈ సమీక్ష జరిగింది. ఈ నెలలోనే సర్వే మొదలవుతుందని, ప్రధాన కాలువలు,డ్రెయిన్లలో పూడిక ఏ స్థాయిలో ఉంది. వాటి పరిస్థితి ఏంటనేది మ్యాప్‌లతో సహా ఈ సర్వే చేయనున్నారు. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలలో మొత్తం ఈ సర్వే జరుగుతుంది ఇరిగేషన్ అధికారుల సహకారంతో ఐఐసీటీ ఈ సర్వే నిర్వహించనుంది. కాగా డ్రిప్ పథకం కింద సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజి మరమ్మతులకు కేటా యించిన రూ.150 కోట్లతో ఎప్పుడు పనులు మొదలపెడతారనేది సమావేశంలో నిర్ణయించలేదు. ప్రస్తుతం సర్వే పైనే ప్రధాన దృష్టి పెట్టడం గమనార్హం.

12న అక్కూ పీజీ క్యాంపస్‌లో అంతర్జాతీయ సదస్సు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలోని ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో లింగ గుర్తింపులు, అధికారం, ప్రదర్శన, ప్రాతినిధ్యం వంటి సామాజిక సాంస్కృతిక అంశాలపై ఈ నెల 12న అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. సంబంధిత బ్రోచర్‌ను నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తి పెంచడమే కాకుండా అంతర్జాతీయ స్థాయి ఆలోచనలను అవగాహన చేసుకునేందుకు ఈ సదస్సు వేదికగా నిలుస్తుందన్నారు. పలువురు అంతర్జాతీయ నిపుణులు ప్రసంగించునున్న ఈ సదస్సును విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని ఉపకులపతి కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతశ్రీ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

'అన్నవరం' ఈవోగా వేండ్ర త్రినాథరావు

ప్రభుత్వ కార్యదర్శి ఉత్తర్వులు జారీ



త్రినాథరావు

అన్నవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం నూతన ఈవోగా వేండ్ర త్రినాథరావును నియమిస్తూ మంగళవారం ప్రభుత్వ కార్యదర్శి ఎం.హరిజవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈవోగా ఉన్న వీర్ల సుబ్బారావు ఏడాది కాలపరిమితితో రెవెన్యూ విభాగం నుంచి డిప్యూటేషన్‌పై గతేడాది డిసెంబరు 13న బాధ్యతలు స్వీకరించారు. మరో 6నెలల పొడిగింపు కోసం ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. ఏడాదికాలంలో దేవస్థానం పాలనపై అనేక విమర్శలు రావడంతో బదిలీ అనివార్యమయింది. నూతన ఈవో వేండ్ర త్రినాథరావు ప్రస్తుతం రాజమండ్రి రీజినల్ జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తుండగా అన్నవరం దేవస్థానం బాధ్యతలు అప్పగించారు. గతంలో ఈయన అన్నవరం దేవస్థానంలో 2పర్యాయాలు ఈవోగా పనిచేయడం, ఈ ఏడాది కార్తీకమాసంలో ప్రత్యేక ఉత్సవాలైన గిరిప్రదక్షిణ, తదితర వాటికి ప్రత్యేకాధికారిగా నియమితుల య్యారు. సౌమ్యుడిగా పేరున్న త్రినాథరావు నియామకంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తుని మున్సిపాలిటీ తొలి మహిళా చైర్‌పర్సన్ రత్నావతి కన్నుమూత

మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య సంతాపం



బొండా రత్నావతి (ఫైల్)

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మున్సిపాలిటీ తొలి మహిళా చైర్‌పర్సన్ బొండా రత్నావతి (80) వయోభారంతో కన్నుమూశారు. తుని పట్టణంలోని సాయినగర్‌లో సోమవారం రాత్రి ఆమె తుదిశ్వాస విడిచారు. టీడీపీ నుంచి గెలుపొందిన ఆమె 1987 నుంచి 1992 వరకు తుని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా సేవలందించారు. టీడీపీ ఆవిర్భవించిన తొలినాళ్లలో ఆ పార్టీ నుంచి గెలుపొంది చైర్‌పర్సన్ పీఠాన్ని అధిరోహించారు. మున్సిపాలిటీ పరిధిలో వచ్చిన పలు మార్పులు ఆమె హయాంలో తీసుకున్న నిర్ణయాలే. పట్టణ అభివృద్ధికి రత్నావతి విశేష కృషి చేశారని అప్పటి తరానికి చెందిన పలువురు తెలిపారు. రత్నావతి మృతికి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, తుని ఎమ్మెల్యే యనమల దివ్య సంతాపం వ్యక్తం చేశారు.

బంధువులమని చెప్పి తీసుకెళ్లి..

బాలికపై అత్యాచారం

నిందితుడితో పాటు సహకరించిన మరో ఇద్దరి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్

ముమ్మిడివరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో బంధువులమని చెప్పి బాలికను బయటకు తీసుకెళ్లి అత్యాచారం చేసిన వ్యక్తితో పాటు అతడికి సహకరించిన మరో ఇద్దరు అరెస్ట్ అయ్యారు. ఈ వివరాలను మంగళవారం ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌లో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ వెల్లడించారు. నిందితులను మీడియా ముందు హాజరుపరిచారు.

అసలేం జరిగిందంటే..?

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక ముమ్మిడివరం మండలం ఠాణేలంక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. కాట్రేనికోన మండలం పల్లంకుర్రు వడ్డివారిపేటకు చెందిన మోకా గిరిబాబు ఈనెల 3న గురుకుల పాఠశాలకు వచ్చాడు. బాబాయిని అని చెప్పి అతడితో పాటు వరసకు మరదలు అయిన నేరేడుమిల్లి అర్చనాదేవి అలియాస్ చిన్నీ సాయంతో బాలికను ఆసుపత్రికి తీసుకెళ్తానని పాఠశాల యాజమాన్యాన్ని అనుమతి కోరారు. వారు అంగీకరించకపోవడంతో తాము రక్త బంధువులమని మరో మహిళతో చెప్పించి నమ్మబలికారు. బాలికకు ఉన్న అనారోగ్య సమస్య దృష్ట్యా వారితో బయటికి పంపించారు. వారు మోటారుసైకిల్‌పై బయలుదేరారు. అర్చనాదేవిని గిరిబాబు ముమ్మిడివరంలో వదిలి బాలికను అక్కడి నుంచి తీసుకుపోయాడు. అయితే ఆరోజు సాయంత్రానికి బాలిక తిరిగి రాకపోవడంతో పాఠశాల ప్రిన్సిపాల్ డి.శారద ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేయగా బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేశారు. గురువారం ఉదయం గిరిబాబు బాలికను పాఠశాల వద్దకు తిరిగి అప్పచెప్పగా యాజమాన్యం విషయాన్ని పోలీసులకు తెలియచేయడంతో గిరిబాబు అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో ఆ బాలికను మహిళా ఎస్ఐతో విచారించగా పలు విషయాలు వెల్లడయ్యాయని డీఎస్పీ తెలిపారు.

లాడ్జికి తీసుకెళ్లి..

బాలికను గురుకుల పాఠశాల నుంచి బయటికి తీసుకువెళ్లిన గిరిబాబు ఆ రోజు తూర్పుగోదావరి జిల్లా గౌరీపట్నం తీసుకెళ్లి కొంతసేపు గడిపి అక్కడి నుంచి అమలాపురంలోని శ్రీగణపతి లాడ్జికి తీసుకెళ్లి గుమస్తాగా పనిచేస్తున్న నాగవరపు వెంకటరమణ అలియాస్ బద్రికి కొంతసొమ్ములు ఆశగా చూపి గది అద్దెకు తీసుకుని ఆ రాత్రి ఆ బాలికపై పలుసార్లు అత్యాచారం చేసినట్టు విచారణలో తేలింది. గిరిబాబు ఆ బాలిక ఇంటి పక్కనే నివాసం ఉంటున్నాడు. తల్లి గల్ఫ్‌లో ఉండడం, తండ్రి పనుల నిమిత్తం బెంగుళూరులో ఉండడంతో బాలిక నాన్నమ్మ, తాతయ్యల వద్దే ఉంటుంది. దీంతో బాలిక కుటుంబంతో పరిచయం పెంచుకుని మాయమాటలు చెప్పి బాలికను లోబరుచుకున్నాడు. ఆమె సెలవులకు వచ్చినప్పుడు పలుమార్లు అత్యాచారం చేశాడు. బాలికకు అనారోగ్యం దృష్ట్యా వైద్యం కోసం గిరిబాబును ఆమెతో ఆసుపత్రికి తోడుగా పంపేవారని, దీన్ని గిరిబాబు ఆసరాగా తీసుకునేవాడు. అత్యాచారానికి పాల్పడిన గిరిబాబు, అతడికి సహకరించిన నేరేడుమిల్లి అర్చనాదేవి అలియాస్ చిన్నీ, లాడ్జి గుమస్తా నాగవరపు వెంకటరమణపై పోక్సో చట్టం కింద కిడ్నాప్, అత్యాచారం కేసులు నమోదు చేసి సోమవారం సాయంత్రం ముగ్గురిని అరెస్టు చేసి మంగళవారం ముమ్మిడివరం కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారని డీఎస్పీ ప్రసాద్ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ ఎం.మోహన్ కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ పాల్గొన్నారు.

పాఠశాల ప్రిన్సిపాల్, హౌస్ టీచర్‌పై చర్యలు

గురుకుల పాఠశాలలో విద్యార్థిని అదృశ్యం.. అత్యాచారం సంఘటనపై ఆ పాఠశాల ప్రిన్సిపాల్ డి.శారదను సస్పెండ్ చేయగా కాంట్రాక్టు బేసిక్‌పై పనిచేస్తున్న మేథమెటిక్స్ టీచరు, హౌస్ టీచరు డి.లోవకుమారిని విధుల నుంచి తొలగిస్తూ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఉత్తర్వులు విడుదల చేసింది.

విద్యార్థినుల ధర్నా

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.శారదపై సస్పెన్షన్ ఎత్తివేయాలని, హౌస్ టీచర్ డి.లోవకుమారిని విధుల తొలగింపు నుంచి రద్దు చేయాలని కోరుతూ ఆ పాఠశాల విద్యార్థినులు సోమవారం ధర్నా నిర్వహించారు. వారికి పేరెంట్స్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు సంఘీభావం తెలిపారు. పాఠశాల నుంచి బయటకు వెళ్తున్న ప్రిన్సిపాల్‌ను వెళ్లిపోరాదంటూ అడ్డుకున్నారు. ప్రిన్సిపాల్ తమను పిల్లల్లా చూసుకుంటున్నారని, ఆమెను సస్పెండ్ చేయడం తగదని నినాదాలు చేశారు. సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆందోళన విరమించాలని విద్యార్థులకు ఎంత నచ్చచెప్పినా ససేమిరా అన్నారు. డీసీవో వచ్చి హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో సాంఘిక సంక్షేమ జిల్లా కోఆర్డినేటర్ జి.రాజకుమారి వచ్చి విద్యార్థినులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రిన్సిపాల్ సస్పెన్షన్ విషయం, హౌస్ టీచర్ తొలగింపు రద్దు విషయం ఉన్నతాధికారులతో మాట్లాడి వాటిని ఎత్తివేసేలా ప్రయత్నిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



ధర్నా నిర్వహిస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థినులు

తూకాల్లో తేడాలు వాస్తవమే..

చేబ్రోలులో 4 గంటల పాటు రైతుల ధర్నా

పట్టు పరిశ్రమల శాఖ అధికారులపై కేసు

ఎలక్ట్రానిక్ కాటా సీజ్



కాటాను పరిశీలిస్తున్న అధికారి సహిద్ సలీం

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ప్రభుత్వ పట్టు గూళ్ల విక్రయ కేంద్రం (పట్టు మార్కెట్)లో తూకాల్లో వస్తున్న తేడాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రెండోరోజు మంగళవారం రైతులు ఆందోళన కొనసాగించారు. తేడాలు వాస్తవేమనని తేలడంతో పట్టుపరిశ్రమల శాఖ అధికారులపై కేసు నమోదు చేస్తున్నట్టు తూనికలు, కొలతలు శాఖ అధికారులు ప్రకటించారు. చేబ్రోలు పట్టు మార్కెట్‌లోని ఎలక్ట్రానిక్ కాటాలోని తూకంలో తేడాలు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు మంగళవారం 4 గంటల పాటు ధర్నా నిర్వహించారు. తూకంలో తేడాలతో మూడేళ్లుగా తాము భారీగా నష్టపోయామని, పరిహారం అందజేయాలని, బాధ్యులైన పట్టు పరిశ్రమశాఖ డిప్యూటీ డైరెక్టర్, ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి రైతుకు కనీసం రూ.3-5లక్షల వరకు నష్టం జరిగిందని తెలిపారు. 100కిలోలకు 2.68కిలోలకు పైగా తక్కువ వచ్చిందని చెప్పారు. పట్టు పరిశ్రమశాఖల అధికారులు, వ్యాపారులు కుమ్మక్కయి రైతులకు నష్టపోయేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులను సస్పెండ్ చేసి తాము నష్టపోయిన సొమ్ములను పరిహారంగా ఇప్పించాలని డిమాండ్ చేశారు.

రైతులతో చర్చలు

పట్టు పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ గీతారాణి సెరీకల్చర్ కార్యాలయానికి చేరుకుని రైతులను చర్చలకు ఆహ్వానించారు. అయితే డీడీతో చర్చలు జరిపేందుకు రైతులు నిరాకరించారు. దీనితో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గొల్లప్రోలు తహశీల్దారు రామ్‌కుమార్, ఎస్ఐ రామకృష్ణ చేబ్రోలు చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. పట్టు పరిశ్రమల శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని, మూడేళ్లుగా జరిగిన నష్టాన్ని తమకు పరిహారంగా అందజేయాలని, ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటి ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహశీల్దారు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన

తూకం-మోసం శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ సహిద్ సలీం చేబ్రోలు చేరుకుని ఎలక్ట్రానిక్ కాటాను తనిఖీ చేశారు. 20కిలోలకు అరకిలో, 50కిలోలుకు 1.340కిలోలు, 100 కిలోలకు 2.780కిలోల తేడాను గమనించినట్టు సలీం తెలిపారు. తాను నాలుగేళ్లుగా ఇదే జిల్లాలో పనిచేస్తున్నానని, తమ శాఖ రికార్డుల్లో చేబ్రోలు పట్టు మార్కెట్‌లో ఎలక్ట్రానిక్ కాటా ఉన్నట్లు లేదా సీళ్లు వేయించినట్లు గాని లేదని చెప్పారు. పట్టు పరిశ్రమల శాఖ అధికారులపై కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఎలక్ట్రానిక్ కాటాను సీజ్ చేస్తున్నట్టు ఆయన చెప్పారు.



పట్టు రైతులతో చర్చలు జరుపుతున్న తహశీల్దారు, ఎస్ఐ

త్రుటిలో తప్పిన

ప్రమాదం!

ప్రైవేట్ స్కూలు బస్సు బోల్తా

స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడ్డ 40మంది చిన్నారులు

తీపర్రు వద్ద ఘటన





బోల్తా పడిన స్కూలు బస్సు, ప్రమాదంలో గాయపడిన మహిళ

పెరవలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రైవేటు స్కూలు బస్సు బోల్తా కొట్టగా విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా తాడిపర్రు జ్యోతి స్కూలుకు చెందిన బస్సు కానూరు అగ్రహారం ఉసులుమర్రులో విద్యార్థులను ఎక్కించుకుని తీపర్రులో పిల్లలను ఎక్కించుకునేందుకు వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో గోదావరి ఏటిగట్టుపై మలుపు తిప్పుకునేందుకు వచ్చింది. మలుపు తిప్పే క్రమంలో గోదావరి వైపు అప్రోచ్ రోడ్డు దాటి రివర్స్‌లో కొద్దిమేర దిగింది. దీంతో బ్రేకులు ఫెయిలై బస్సు ముందుకు రాకుండా వెనకకు కదిలింది. దీంతో డ్రైవర్ కొద్దిమేర స్టీరింగ్‌ను కంట్రోల్ చేసినప్పటికి అప్రోచ్ రోడ్డు సగం పైగా దూరం వెళ్లిన బస్సు అనంతరం పక్కకు తిరగబడింది. సుమారు 40మంది పిల్లలు భయంతో కేకలు వేశారు. బస్సు ముందుభాగంలోని అద్దం ఊడిపడడంతో అందులో నుంచి పిల్లలందరూ స్వల్పగాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఆయాగా పనిచేస్తున్న మహిళకు కూడా గాయాలయ్యాయి. గాయాలైనవారికి స్థానికులు సపర్యలు చేశారు. సంఘటన తెలిసిన వెంటనే పిల్లల తల్లిదండ్రులు, ప్రజలు సంఘటనా స్థలానికి వచ్చారు. కొంతమందిని తణుకు ఆసుపత్రికి తీసుకెళ్లారు. తీపర్రుకు చెందిన ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, కుందుల భూపతిరావు, తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్ర ఘటనా స్థలంలో సహాయ సహకారాలు అందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లేని బస్సులను తిప్పుతూ పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆందోళన చెందారు.



విద్యార్థులను ఊరడిస్తున్న స్థానికులు

మంత్రి దుర్గేష్ ఆరా

ఈ ఘటనపై మంత్రి కందుల దుర్గేష్ ఆరా తీశారు. స్థానిక నాయకుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పాఠశాల యాజమాన్యం, అధికారులతో మాట్లాడారు. గాయపడిన చిన్నారులకు తక్షణం వైద్య సదుపాయం అందించాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా బస్సులు లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని స్కూలు యాజమాన్యాలను హెచ్చరించారు. పిల్లల తల్లిదండ్రులు కూడా లోపాలను గుర్తించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని మంత్రి సూచించారు.

తిమ్మాపురంలో ఉద్రిక్తత

భవనం ఖాళీ చేయించేందుకు భారీగా పోలీసుల మొహరింపు



పోలీసుల పహారా నడుమ ఇల్లు ఖాళీ చేయిస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు నుంచి రుణం తీసుకున్న వ్యక్తులు సకాలంలో బాకీ చెల్లించకపోవడంతో సదరు స్థిరాస్థిని స్వాధీనం చేసుకునే క్రమంలో యూనియన్ బ్యాంకు అధికారులు, బాకీదారులకు మధ్య ఏర్పడిన వాగ్వాదం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసిన సంఘటన మంగళవారం కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో జరిగింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు.. కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో సుమారు 60 మంది పోలీసులు రంగంలోకి దిగి సదరు స్థిరాస్థి బ్యాంకుకి స్వాధీనం చేసేందుకు కృషి చేశారు. యూనియన్ బ్యాంకు అధికారులు మెయిన్ గేటుకి అంటించిన ఉత్తర్వుల మేరకు.. తిమ్మాపురం మెయిన్‌రోడ్డులో పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తికి జీ ప్లస్ త్రీ భవనం ఉంది. ఈ ఆస్తిని యూనియన్ బ్యాంకులో అకౌంట్ ఆఫ్ మెస్సర్స్ గౌతమి సురేష్ రైస్ ఇండస్ట్రీస్ ద్వారా తాకట్టు పెట్టి రుణం పొందారు. సకాలంలో రుణాన్ని వెనక్కి బ్యాంకుకి చెల్లించకపోవడంతో బ్యాంకు నిబంధనల మేరకు సదరు ఆస్థిని 28-4-2023, 30-5-2023లో ఈ వేలం పాట నిర్వ హించారు. మెస్సర్స్ సీ ఫ్రైడ్ మేనేజిమెంట్ అండ్ కన్సల్టింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ భవనాన్ని సుమారు రూ.1.15 కోట్లకు ఈ ఆక్షన్‌లో పాడుకుంది. 2023-24, 2024-25, 2025-26లో 12 మే 2025లో భవనం లోపల వస్తువులు, ఇతర పరికరాలు ఖాళీ చేసి భవనాన్ని అప్ప గించాలని 9 మే 2025లో హైకోర్టు ఫైనల్ తీర్పు నిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి భవనం స్వాధీనానికి బ్యాంకు అధికారులు రావడం, సదరు రుణగ్రహీతకు చెందిన వ్యక్తులు అడ్డుకోవడం జరుగుతుంది. దీంతో భవనాన్ని ఖాళీ చేయించి అప్పగించాలని ఈ వేలంలో దక్కించుకున్న కంపెనీ ఉన్నత అధికారుల ద్వారా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు సిఫారసు చేయించడంతో ఎట్టకేలకు మంగళవారం ఉదయం తహశీల్దార్ కుమారి, కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, బ్యాంకు అధికారులు తిమ్మాపురం చేరుకున్నారు. భవనంలో 3 అంతస్తుల్లో నుంచి సామాన్లు తొలగించే ప్రక్రియను అడ్డుకున్నారు. భారీగా పోలీసులు,ప్రత్యేక రిజర్వ్ బలగాలు చేరుకుని స్థానికులను పంపించి వేశారు. సామాన్లు తొలగించేందుకు సైతం వాహనాలను రాకుండా అడ్డుకోవడంతో పోలీసులు పహారా ద్వారా సామాన్లు తొలగించి, వాటిని బ్యాంకుకి తరలించారు.

'అయినవిల్లి' ఆదాయం రూ.46.30 లక్షలు

అయినవిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి దేవస్థానంలోని హుండీలను మంగళవారం లెక్కించారు. 91 రోజులకు ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.45,07,994, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.1,22,245 వెరసి మొత్తం రూ.46,30,239 ఆదాయం లభించిందని ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 219.9 గ్రాముల వెండి, 4.2 గ్రాముల బంగారం, 20 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయని ఆయన చెప్పారు.

సత్తా చాటిన తుని యువకుడు

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం



సర్టిఫికెట్లతో సాయి, చిన్న కుండల తయారీ వీల్



తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో కాకినాడ జిల్లా తునికి చెందిన యువకుడు తిరుమలనేడి సాయి స్థానం సాధించాడు. ఇటీవల అతడు తయారుచేసిన అతి చిన్న మోటార్ వీల్ (ద స్మాలెస్ట్ మోటరైజ్డ్ పోటరీ వీల్) గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. ఈ మేరకు సాయికి వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ అందింది. అతి చిన్న కుండలు తయారు చేసే మోటార్ వీల్ తయారు చేసి మరోసారి గిన్నిస్ రికార్డ్సులోఅతడు స్థానం సాధించాడు.

వేడుక ఇంట్లో శోకం..

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి



వీరమణి (ఫైల్)

శంఖవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేడుక జరగాల్సిన ఇంట్లో తీవ్ర శోకం అలుముకుంది. మహిళను కరెంటు తీగ రూపంలో మృత్యువు కబళించింది. బాధకరమైన ఈ ఘటన కాకినాడ జిల్లా కత్తిపూడిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గనిశెట్టి వీరమణి (35) తన అక్క కుమార్తె రజస్వల వేడుకను తన ఇంట్లో చేద్దామని ఏర్పాటు చేసుకుంది. బుధవారం వేడుక చేసేందుకు అన్ని సిద్ధం చేశారు. మంగళవారం ఉదయం వీరమణి లైట్ ఆన్ చేయగా విద్యుత్ షాక్ తగిలి విలవిలలాడింది. ఆమెను స్థానికుల సహాయంతో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలపడంతో వేడుక జరగాల్సిన ఇంట్లో తీవ్ర శోకం అలముకుంది. వీరమణికి భర్త గనిశెట్టి చినవెంకటరమణ, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అన్నవరం పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి...

ఉప్పలగుప్తం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎన్.కొత్తపల్లిలో ఆక్వా చెరువుల వద్ద పనిచేస్తున్న చల్లపల్లి పంచాయతీ పర్రపేటకు చెందిన బత్తుల వెంకట్రావు (38) మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. మృతుడి భార్య వెంకట ప్రసన్నలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బావిలో పడి వృద్ధుడు...

పెద్దాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ బావిలో పడి వృద్ధుడు మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కట్టమూరులో మంగళవారం జరిగింది. గ్రామంలో కిత్తయ్య చెరువు సమీపంలో ఉన్న బావి వద్దకు బహిర్భూమికి కావూరి బీమయ్య (75) వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలు జారి బావిలో పడిపోయాడు. గత 3 రోజుల నుంచి బీమయ్య కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. బావిలో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెద్దాపురం ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేశారు.

కాకినాడలో పట్టపగలు హత్య

చెప్పులు కుట్టుకునే కార్మికుడిని చంపి పరారైన ఆటోడ్రైవర్

పట్టుకున్న పోలీసులు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్



సత్యన్నారాయణ మృతదేహం

కాకినాడ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చెప్పులు కుట్టుకునే చిరు కార్మికుడిని ఆటో డ్రైవర్ చేసిన సంఘటన మంగళవారం కాకినాడలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన కీర్తి సత్యన్నారాయణ (45) వ్యక్తిగత కారణాలతో భార్య, బిడ్డలను వదిలివేసి 10 ఏళ్ల క్రితం కాకినాడ వచ్చేశాడు. స్థానిక రేచర్లపేటకు చెందిన రాళ్ళ మేరీ అనే మహిళతో అతడికి పరిచయం ఏర్పడి అదికాస్తా సహజీవనానికి దారితీసింది. ఈ క్రమంలో సత్యన్నారాయణ సినిమా రోడ్డులోని సంతచెరువు కూడలిలో కనకదుర్గమ్మ ఆలయ సమీపంలో చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే వారిద్దరూ మద్యానికి బానిస కావడంతో రోజు సాయంత్రం పూటుగా మద్యం తాగేవారు. ఈ నేపథ్యంలో సత్యన్నారాయణ సోమవారం రాత్రి మద్యం తాగి దుమ్ములపేటకు చెందిన ఆటో డ్రైవర్ అత్తిలి రంగాను అతడి తల్లిని దూషిస్తూ కారణం లేకుండా వాగ్వివాదానికి దిగా డు. అనంతరం గొడవ సద్దుమణిగింది. అయితే మంగళవారం మధ్యాహ్నం సత్యన్నారాయణ చెప్పులు కుట్టే పనిలో నిమగ్నమై ఉండగా ఆటో డ్రైవర్ రంగా అక్కడికి మద్యం తాగి వచ్చి తన తల్లిని ఎందుకు దూషించావని ప్రశ్నించాడు. దానికి సత్యన్నారాయణ ఆ విషయం గుర్తులేదని చెప్పడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రంగా కోపోద్రిక్తుడై చెప్పులుకుట్టేందుకు వినియోగించే పదునైన రంపిని సత్యన్నారాయణ గుండెల్లో దింపి అక్కడ నుంచి పరారయ్యాడు. సత్యన్నారాయణ తీవ్ర రక్తస్రావంతో పరిగెడుతూ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కుప్పకూలిపోయాడు. అది గమనించిన పోలీసులు క్షతగాత్రుడిని జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్పీ జి.బిందుమాధవ్, కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్‌పాటిల్ సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్‌టీమ్ రంగంలోకి దిగి నిందితుడి వేలి ముద్రలు సేకరించింది. హత్య జరిగిన మూడు గంటల్లోనే నిందితుడు రంగాను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ కె.సత్యన్నారాయణ తెలిపారు. కాకినాడ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ మోటార్లలో కాపర్ వైర్ల చోరీ

ఎటపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం రాచగొంపల్లి, గౌరిదేవిపేట గ్రామాల్లో గోదావరి ఒడ్డున రైతులు వినియోగించే 10 హెచ్‌పీ మోటార్లలోని కాపర్ వైర్ల (త్రీకోరు)ను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఏకకాలంలో ఈ రెండు గ్రామాల్లోని గోదావరి ఒడ్డున పంటల నీటితడుల కోసం రైతులు ఏర్పాటు చేసుకున్న 20 మోటార్లలోని కాపర్ వైర్లను కట్ చేసుకుని వెళ్లారు. ఒక్క మోటారులో రూ.5వేల విలువైన కాపర్ వైరు ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. వారం క్రితం ఇదే తరహాలో నెల్లిపాక, చోడవరం గ్రామాల్లోని గోదావరి నదీ ఒడ్డున రైతులకు చెందిన వ్యవసాయ మోటార్లలోని కాపర్ వైర్లను కూడా చోరీ చేశారు. నెల్లిపాకలో 7 మోటార్లు, చోడవరంలోని 3 మోటార్లలోని కాపర్ వైర్లను ఎత్తుకెళ్లారు. దీంతో నెల్లిపాక రైతులు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



కాట్రేనికోన, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం బ్రహ్మసమేధ్యం పంచాయతీ కొత్తపాలెనికి చెందిన మేడ సత్యం (55) సోమవారం రాత్రి చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మరణించాడు. అతడి మృతదేహం మంగళవారం ఉదయం గోదావరి పాయలో తేలియాడుతుండగా స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య నాగవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తునిలో దొంగల హల్‌చల్

ఫిజియోథెరపి సెంటర్‌లో నగదుతో పాటు పార్కు చేసిన బైక్ చోరీ

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టణంలో ఎంపీపీ బొప్పన రాముకు చెందిన ఫిజియోథెరపి సెంటర్‌లో సోమవారం రాత్రి దొంగలు చొరబడ్డారు. ఆసుపత్రి గోడ దూకి లోపలికి ప్రవేశించిన ఇద్దరు రూ.30వేల నగదు అపహరించారు. అలాగే ఫిజియోథెరపి సెంటర్ సమీపంలో ఉన్న బిల్డింగ్ వద్ద పార్కు చేసిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో తుని పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ విజయబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

కిర్లంపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం భూపాలపట్నంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. భూపాలపట్నం గ్రామానికి చెందిన కాకర అప్పారావు ఈనెల 5న హత్యకు గురయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో అదే గ్రామానికి కుక్ల రాజబాబు, నాగేశ్వరరావు నిందితులుగా ఉన్నారు. రాజబాబును సోమవారం జగ్గంపేట మండలం రామవరం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాగేశ్వరావు కోసం పోలీసు బృందాలు గాలించగా మంగళవారం జగ్గంపేట గ్రామ శివారున మోడల్ డిగ్రీ కళాశాల వద్ద ఉన్నట్టు గమనించి అరెస్టు చేశారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐసతీష్‌ను డీఎస్పీ అభినందించారు.



నాగేశ్వరరావును అరెస్టు చేసిన పోలీసులు

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

మరమ్మతులతోనే సరా!


రాళ్లు లేచిపోయి అధ్వానంగా ఉన్న ఫ్లై వోవర్ అప్రోచ్ రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో ప్రధాన రహదారులు గుంతలమయంగా ఉన్నాయి. బొమ్మూరు నుంచి బాలాజీపేట, మీదుగా హుకుంపేట రహదారి కొన్ని చోట్ల గుంతల పడ్డాయి. అయితే వీటికి తరచూ మరమ్మతులు చేస్తున్నారే తప్ప పూర్తి స్థాయిలో సమస్య పరిష్కారం కావడం లేదు, అలాగే బొమ్మూరు సెంటరు నుంచి రాజవోలు వెళ్లే రహదారి పరిస్థితి కూడా అంతే. దీంతో పాటు మోరంపూడి సెంటరు వద్ద ఫ్లైవోవర్ ఆనుకొని వున్న అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడంతో గతుకుల మయంగా వుండడంతో వాహన చోదకులకు సమస్యగా మారింది.

అనాలోచిత నోటిఫికేషన్లను రాష్ట్రం సవరించాలి

రవాణా వాహనరంగ కార్మికుల నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు, రవాణా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలకు సంబంధించి ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అనాలోచిత నోటిఫికేషన్లను రాష్ట్ర ప్రభుత్వం సవరించాలని రవాణారంగ వాహన కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని రవాణాశాఖ కార్యాలయం ఎదుట రవాణారంగ వాహన కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముచ్చకర్ల సత్యనారాయణ మాట్లాడుతూ వాహనాల ఫిట్‌నెస్‌ను ధ్రువీకరించేందుకు, సంబంధిత ధ్రువపత్రాన్ని జారీ చేయడానికి ప్రభుత్వేతర వ్యక్తులకు, కాంట్రాక్టర్లకు అధికార విధులు కట్టబెట్టడం అభ్యంతరకరమని అన్నారు. కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా వాహనాల వయస్సును సాకుగా చూపించి భారీగా ఫీజులను పెంచడం దారుణమని పేర్కొన్నారు. తక్షణమే వీటిని సవరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రవాణా అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, మినీగూడ్స్ వేన్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోసూరి శ్రీనివాస్, టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఐబీ విజన్‌పై శిక్షణ

బిక్కవోలు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల జీవనోపాధి మెరుగుపరచడమే ఐబీ విజన్ లక్ష్యమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని డ్వాక్రా వీవోఏలు, ఓబీలకు ఐబీ విజన్‌పై నాలుగు రోజులపాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమాలను బిక్కవోలులో ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్వాక్రా మహిళల్లో ఆర్థిక స్వయం సమృద్ధి, పేదరికాన్ని నిర్మూలించడం, జీవనోపాధి మెరుగుపరచడం, వివిధ వ్యాపారాలకు సబ్సిడీ రుణాలు, బీమా సౌకర్యాలు కల్పించి వ్యాపారవేత్తలుగా ప్రోత్సహించడం ఐబీ విజన్ ఉద్దేశ్యమన్నారు.ఈ అంశాలపై వీవోఏలు, ఓబీలకు 8 రకాల శిక్షణలు ఇస్తామని, వారు శిక్షణ పొందిన తరువాత గ్రామాల్లోని డ్వాక్రా మహిళలకు శిక్షణ ఇచ్చి ఆదర్శ గ్రామాలు తయారయ్యేలా కృషి చేస్తారన్నారు. ఏపీఎం సుప్రియ మాట్లాడుతూ ఐబీ విజన్ అమలు చేసేందుకు జిల్లాలో రెండో విడతలో బిక్కవోలు మండలం ఎంపికయ్యిందన్నారు.


శిక్షణలో మాట్లాడుతున్న డీపీఎం సంపత్‌కుమార్

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన అవసరం

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పీఎంపీలు స్క్రబ్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని శ్రీమేధ హాస్పిటల్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ పోతుల పవన్ కిషోర్ అన్నారు. మంగళవారం పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హుకుంపేటలో మండలాధ్యక్షుడు అబ్దుల్ రహమాన్‌ఖాన్ అధ్యక్షతన జరిగిన వైద్య విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి స్క్రబ్ టైఫస్ వ్యాధి కారణాలు, లక్షణాలు, నివారణోపాయాలను వివరించారు. చిగ్గర్ మైట్ అనే చిన్న పురుగు కుట్టడం వల్ల తీవ్రమైన జ్వరం, శరీరం, కండరాల నొప్పులు, అలసట, చర్మంపై దద్దుర్లు వస్తాయని, ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా చిన్నారులపై ఉంటుందన్నారు.గైనకాలజిస్ట్ డాక్టర్ ఆర్తి చీకట్ల మహిళల్లో గర్భకోశ వ్యాధులు, పీసీవోడీ, గర్భిణీ సమయంలో వచ్చే మధుమేహం, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ రాకుండా వేసే హెచ్‌పీవీ వ్యాక్సిన్ గురించి వివరించారు.అనంతరం వైద్య నిపుణులను సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, పి.దేవానందం, పి.చిన్ని, మట్టా రమేష్, కేఎస్ రెడ్డి, ఎ.సురేష్‌బాబు, కె.లక్ష్మీనారాయణ, పీఎస్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

అనపర్తిలో యూరియా కొరత లేదు: ఏడీఏ


బిక్కవోలు సొసైటీలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ కృష్ణ

బిక్కవోలు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో యూరియా కొరత లేదని అనపర్తి ఏడీఏ డీవీ కృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన బిక్కవోలులోని సొసైటీని సందర్శించి రైతులతో మాట్లాడారు. రబీ సీజన్ డిసెంబరు రెండో వారంలో ప్రారంభమౌతున్నందున్న మండలంలోని అన్ని సొసైటీల్లో యూరియా స్టాక్‌లు వుంచామని, పంటకాలం పూర్తయ్యేలోగా మూడు దఫాలుగా రైతులకు అందిస్తామన్నారు.బిక్కవోలు సొసైటీకి 50 టన్నుల యూరియా సరఫరా చేశామని,ఎకరానికి ఒక బస్తా చొప్పున రైతులకు ఇవ్వడానికి పాలకవర్గం, అధికారులు నిర్ణయించారన్నారు. ఈ-పోస్ మిషన్‌లో రైతుల వేలిముద్రలు తీసుకుని యూరియా ఇస్తున్నారని, సర్వర్లు స్లోగా ఉన్నందున రైతులు క్యూలో నిలబడవలసి వస్తుందన్నారు. బిక్కవోలు సొసైటీ పరిధిలో మూడు వేల ఎకరాలు సాగవుతున్నాయని వీటికి 3దఫాలుగా అవసరమైన 400 మెట్రిక్ టన్నుల యూరియా అందిస్తామన్నారు.కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, తహశీల్దార్ సత్యకృష్ణ, ఏవో శామ్యూల్‌జాన్ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ పురుషుల పోటీలు, యూనివర్శిటీ టీం సెలక్షన్స్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫుట్‌బాల్ ఆట బృంద స్ఫూర్తిని, సహనాన్ని, నిర్ణయ సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హితకారిణి సమాజం ఛైర్మన్ యాళ్ల ప్రదీప్, చేబ్రోలు సూర్యనారాయణమూర్తి, కేలం శ్రీనివాసరావు, పీవీబీ సంజీవరావు, శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా నాగరాజు, ప్రభు వ్యవహరించారు.

పాఠశాలల్లో నీటి శుద్ధి యంత్రాలు ప్రారంభం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యం, పారిశుధ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ నగరంలోని 10 ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి యంత్రాలను సీజీఎస్‌టీ ఆడిట్ కమిషనర్ వి.ఆనందకుమార్ మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ అభియాన్‌లో భాగంగా మంగళవారం గుంటూరు సీజీఎస్‌టీ ఆడిట్ కమిషనరేట్ విశాఖపట్నం జోన్ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశామన్నారు. సుమారు 2.26 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ యంత్రాల ద్వారా 726 మంది విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటి సౌకర్యం లభిస్తుందని ఆనందకుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాకినాడ ఆడిట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సి.సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

జనవరి 2 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

అనపర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అనపర్తిలో శారదా సంగీత కళాసమితి ఆధ్వర్యంలో 27వ త్యాగరాజ ఆరాధనోత్సవాలను జనవరం 2 నుంచి 9వరకు నిర్వహించనున్నట్టు సమితి ప్రతినిధులు తెలిపారు. మంగళవారం కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆరాధనోత్సవాల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. సమితి అధ్యక్షుడు తమలంపూడి చిన ఆదిరెడ్డి మాట్లాడుతూ 2న గాత్ర సంగీత కచేరీ, 3న భక్త మార్కెండేయ హరికథ, 4న వేదగోష్ఠి, శృంగేరి శారదా పీఠ వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం, 5న శారదా పీఠం వైభవంపై రెండో రోజు ప్రవచనం, 6న ఆధ్యాత్మిక ప్రవచనం, 7న నాదస్వర వాద్య కచేరీ, 8న గాత్ర కచేరి, 9న భరనాట్య నృత్య ప్రదర్శన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు కొవ్వూరి రఘునాథరెడ్డి, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, మారెళ్ల కృష్ణ ఫణీంద్ర, మునీశ్వర రెడ్డి, కర్రి వెంకటరామకృష్ణారెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థాని బాలాజీ పేటకు చెందిన పున్నాని ముత్యాలమ్మ అనే 70 ఏళ్ల వృద్ధురాలు ఈ నెల 3 నుంచి కనిపించడం లేదని టూ టౌన్ పోలీసులు తెలిపారు. ముత్యాలమ్మ ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదని చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పరాయిభాష నేర్చుకొనేందుకు

మాతృభాషే పునాది


జాతీయ వర్క్‌షాప్‌నకు హాజరైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

» తానా సాహితీవేదిక అధ్యక్షుడు ప్రసాద్

» నన్నయ విశ్వవిద్యాలయంలో ముగిసిన జాతీయ వర్క్‌షాప్

దివాన్‌చెరువు, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) : మాతృభాష పునాదిగా ఉంటేనేగాని పరాయి భాష నేర్చుకోలేమని తానా సాహితీ వేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీలోని భారతీయ భాషాసమితి సంయుక్త ఆధ్వర్యంలో భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం అనే అంశంపై రెండురోజులు పాటు నిర్వహించిన జాతీయకార్యశాల మంగళవారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలోని విజ్ఞానాన్ని వారి భాషలో అన్వయించుకుని విజ్ఞానం పెంచుకుంటున్న దేశం జర్మనీ అని, జర్మనీ భాషలోనే విజ్ఞాన వ్యవహారాలు నడుస్తాయని చెప్పారు. అందరికీ నిర్బంధంగా మాతృభాషలోనే విద్యాబోధన చేసేవిధంగా ఆయా ప్రభుత్వాలు కృషిచేయాలన్నారు. ఏకరూప పదజాలం ద్వారా శాస్త్రీయత ఉంటుందన్నారు. అలాగే అంతర్జాతీయంగా గుర్తింపు, విద్యలో సరళత, అనువాదంలో కచ్చితత్వం ఉంటాయన్నారు. కమిషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ, భారతీయ భాషా సంస్థ, రాష్ట్ర భాష అకాడమీలు వంటివి ఏకరూప పదజాలానికి పని చేస్తున్నాయన్నారు. భారతీయ భాషాసమితి అకడమిక్స్ కోఆర్డినేటర్ కె.గిరిధరరావు మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం-2020 అనుసారం భారతీయ భాషల్లో పాఠ్యపుస్తక నిర్మాణంలో ఏకరూప శాస్త్ర సాంకేతిక పదాలు లేకపోతే విద్యార్థులు ఎంతో శ్రమ పడాల్సి వస్తోందని, అందుచే శాస్త్ర, సాంకేతిక ఏకరూప పదజాల నిర్మాణం ఎంతో అవసరమన్నారు. అంతకు ముందు జరిగిన సమావేశంలో రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షుడు ఆర్‌డీ విల్సన్ తెలుగుభాషకు అకాడమీ చేస్తున్న కృషిని వివరించారు. భారతీయ భాషాసమితి సీనియర్ ఎక్స్‌పర్ట్ ఆర్.ఎస్.సర్రాజు ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ సంస్కృతంలో శబ్దాలను నవ నిర్మాణం చేసే అవకాశం ఉందని, నేడు వాడుకలో ఉన్న అనేక పదాలు సంస్కృత పదాలేనని అన్నారు. సమావేశంలో తలారి వాసు, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి ప్రసంగించారు.అనంతరం అతిథులను సన్మానించి, వర్క్‌షాప్‌కు హాజరైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి ఓలేటి సత్యనారాయణ, వడ్డి విజయసారథి, పేరిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీ అభివృద్ధికి కృషి

ధవళేశ్వరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ నెలకొల్పిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం అభివృద్ధికి కృషి చేస్తానని తోటకూర ప్రసాద్ అన్నారు. మంగళవారం విశ్వ విద్యాలయానికి విచ్చేసిన ఆయనకు వైస్ ఛాన్సలర్ ఆచార్య డి.మునిరత్నం నాయుడు, సిబ్బందితో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి, కాటన్ దొర విగ్రహం వద్ద నివాళులర్పించారు. వర్సిటీ ప్రాంగణాన్ని పరిశీలించారు. తానా పక్షాన అమెరికాలో దాతలు సహకరించే విధంగా చూడాలని వీసీ కోరగా అన్ని విధాలా దాతల సహకారం అందే విధంగా ప్రయత్నిస్తామని ప్రసాద్‌ను హామీ ఇచ్చారు. ఎంఏ తెలుగు ఫస్టియర్ విద్యార్థులకు తానా నిర్వహిస్తున్న భాష, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో చిలుకోట కూర్మయ్య, కేవీ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.6 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

» మరో ఆరు నెలల్లో పూలే అంబేడ్కర్ భవనం పూర్తి » పనుల పరిశీలనలో రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


పూలే అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో రూ.6 కోట్ల సీఎస్ఆర్ ఫండ్స్‌తో పలు అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. మంగళవారం స్థానిక గోదావరి బండ్ రోడ్డులో ఉన్న పూలే అంబేడ్కర్ భవనం నిర్మాణ పనులను ఆయన కూటమి నాయకులు, కార్పొరేషన్, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక వై-జంక్షన్‌లో బీసీ హాస్టల్‌లో టాయిలెట్లు నిర్మించామని, చాలా ప్రాంతాల్లో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేశామని, స్కూళ్లు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధి చేస్తున్నామన్నారు. అయితే గత ప్రభుత్వంలో ఐదేళ్ల సీఎస్ఆర్ నిధులు ఏమైపోయాయని ఎమ్మెల్యే ప్రశ్నించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాజమహేంద్రవరంలో పూలే అంబేడ్కర్ భవనాన్ని నిర్మిస్తున్నామని, మొత్తం రూ.2.05 కోట్లతో పనులు శరవేగంగా జరుగుతున్నాయని, మరో 6 నెలల్లో పనులు పూర్తవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పుష్కరాల నేపథ్యంలో నగరంలో డ్రైనేజీ కోసం రూ.100 కోట్లతో అంచనాలు తయారు చేశామని, ప్రతి వార్డులో పనులు అంచనాలు, ఘాట్ల అభివృద్ధి, కొత్త ఘాట్ల ఏర్పాటుకు అంచనాలు సిద్ధంగా ఉన్నాయని, పుష్కరాల నాటికి అన్ని పనులు పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, మజ్జి రాంబాబు, విద్యుత్ శాఖ ఈఈ నక్కపల్లి శామ్యూల్, కార్పొరేషన్ ఈఈ మాధవి, శెట్టి జగదీష్, దాస్యం ప్రసాద్, మొకమాటి సత్యనారాయణ, కొయ్యల రమణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణలో పోలీసులు విఫలం

» ఎస్పీ దృష్టికి తీసుకెళ్తాం: ప్రజాప్రతినిధులు » కడియం మండల పరిషత్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్

కడియం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడ చూసినా గంజాయి రాజ్యమేలుతోందని, అరికట్టడంలో పోలీసులు వైఫల్యం చెందారని ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. మంగళవారం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేగురుపాడు సర్పంచ్ యాదల స్టాలిన్ మాట్లాడుతూ ఎక్కడ చూసినా గంజాయి ఎక్కువగా ఉందని, నియంత్రించడంలో పోలీసులువిఫలమయ్యారన్నారు.దీంతో ఎంపీపీ మాట్లాడుతూగంజాయి నియంత్రణపై జిల్లా ఎస్పీని సభ్యులంతా కలుద్దామన్నారు. ఏకగ్రీవంగా తీర్మానించారు.కడియం ఎంపీటీసీ గిరజాల బాబు మాట్లాడుతూ రైతులకు ఎరువులు సక్రమంగా అందడం లేదని, ఇన్‌పుట్ సబ్సిడీ రాలేదన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించి ప్రజా భద్రతకు తీసుకుంటున్న చర్యలేంటని ప్రశ్నించారు. ఎంఆర్ పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి మాట్లాడుతూ ఐసీడీఎస్ పనితీరు బాగాలేదన్నారు. ఇళ్ల స్థలాలు సర్వేలో విద్యుత్ బిల్లులను పరిగణలోకి తీసుకోకూడదన్నారు. లే-అవుట్‌ల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అధికారులు సర్పంచ్ ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ పాములమెట్టలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీ నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. దామిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ ముద్రగడ జమీ మాట్లాడుతూ గ్రామంలో ఇళ్ల స్థలాల సర్వేను రెవెన్యూ సిబ్బంది నామమాత్రంగా చేస్తున్నారని అన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు పంతం గణపతి, కలిదిండి విశాలాక్షి, సర్పంచ్‌లు మారిశెట్టి పద్మావతి,ఎంపీటీసీలు పుట్టా అనురాధ, గొల్లపల్లి శ్రీను, నాగిరెడ్డి రామకృష్ణ, ఆకుల సుధాకర్, తహశీల్దారు సునీల్‌కుమార్, ఎంపీడీవో కె.రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌లోనూ తెలుగు పాఠ్యాంశాలు ఉండాలి

తెలుగు మహాసభల పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు


తెలుగు మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సోము

రాజానగరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ విద్యలో కూడా తెలుగు పాఠ్యాంశ బోధన అవసరమని, ఫిబ్రవరిలో అమలాపురంలో జరగనున్న తెలుగు మహాసభల్లో తీర్మానాన్ని ఆమోదించి అమలు చేయాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు సూచించారు. అమలాపురంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 28, మార్చి 1 తేదీల్లో జరగనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహక సమావేశం గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లో ఉపకులపతి కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు)అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, గ్రామీణ జీవిత శైలి, సంప్రదాయాలు వంటి అంశాలు మన సమాజానికి మూలాధారాలని, ఈవిలువలను యువతరానికి చేరవేయడానికి ఇంజనీరింగ్ విద్యలో కూడా తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించాల్సిన అవసరం ఉందన్నారు.మూడో ప్రపంచ తెలుగు మహా సభల్లో ఒక తీర్మానాన్ని ఆమోదించాలని సూచించారు.వీసీ చైతన్యరాజు మాట్లాడుతూ అమలాపురంలో కిమ్స్ వైద్య విద్యాసంస్థల ప్రాంగణంలో రెండు రోజుల పాటు మహా సభలను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రధాన వేదికకు నందమూరి తారక రామారావు వేదికగా నామకరణం చేశామని, మూడు ఉపవేదికలకుగాను రెండింటికి ఆదికవి నన్నయ, శ్రీకృష్ణదేవరాయలు వేదికలుగా నామకరణం చేశామన్నారు. తెలుగు సాహిత్యం, కళలు, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభావంతులను ఆహ్వానించి సత్కరించనున్నామన్నారు. ప్రవచన రాజహంస ధూళిపాల మహాదేవమణి మాట్లాడుతూ అవధానం సహా తెలుగు ప్రక్రియల నిష్ణాతుల మహా సభలకు ఆహ్వానించాలని సూచించారు. సాహితీవేత్త ఎర్రాప్రగడ రామకృష్ణ మాట్లాడుతూ తెలుగు మహా సభల నిర్వహణ మోడల్‌ను పాఠ్యాంశంగా చేర్చే అవకాశాలను పరిశీలించాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో జీజీయూ వీసీ యు.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, పివిబి సంజీవరాజు, తరపత్ర సత్యనారాయణ, న్యాయవాది పి.శ్రీనివాసరావు, రాష్ట్రీయ పండిత పరిషత్ నాయకుడు రాజబాబు, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు సూరి జయత్రినాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు మానుకోవాలి

రంగాపురం కూటమి నాయకులు

అనపర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండలం రంగాపురం కుడుముల చెరువు పూడిక తీత పనులపై మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని రంగాపురం కూటమి నాయకులు హితవు పలికారు.మంగళవారం అనపర్తిలోని ఎన్డీయే కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కుడుముల చెరువు పూడిక తీయాలని రైతులు కోరడంతో ఎమ్మెల్యే అనుమతులు ఇప్పించారని, అయితే పనుల్లో అవినీతి జరిగిందంటూ మాజీ ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.వైసీపీ సానుభూతి పరుడిగా ఉన్న సర్పంచ్ పూడిక తీతకు తీర్మానం చేశారని,అయినా ఇదేమీ తెలియనట్టు ఎమ్మెల్యేపై బురదజల్లడం అర్థరహితమని అన్నారు. సమావేశంలో అప్పలస్వామి, జోష్‌బాబు, గౌరీ శంకర్, ఏసురత్నం, సత్యనారాయణ, చిరంజీవిరాజు పాల్గొన్నారు.

గోరక్షణపేట సెంటర్లో వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోరక్షణ పేటలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు మంగళవారం రాత్రి ఎమ్మెల్సీ సోము వీర్రాజు శంకుస్థాపన చేశారు. ముందుగా విగ్రహ ప్రతిష్ఠకు అనువైన పలు ప్రదేశాలను ఆయన పరిశీలించి అధికారులు, స్థానిక నాయకులతో చర్చలు జరిపారు.స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ కోర్ కమిటీ జిల్లా, మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా ఐదు మోర్చాల నూతన అధ్యక్షుల పరిచయ కార్యక్రమం జరిపారు.

13న జాతీయ లోక్ అదాలత్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలనాల కేసులు సెటిల్ చేసుకునే అవకాశం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత గంధం, కార్యదర్శి, న్యాయమూర్తి ఎన్.శ్రీలక్ష్మిలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు ఆదేశానుసారంగా ట్రాఫిక్ రూల్స్‌ను ఉల్లఘించిన వారిపై పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలానాలను లోక్ అదాలత్‌లో సెటిల్ చేసుకోగలరని ఉత్తర్వులు జారీ చేశారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోరుకొండ సీఐగా సత్యనారాయణ మూర్తి

ఎస్‌ఐగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకారం



కోరుకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.సత్యనారాయణమూర్తి బాధ్యతలు చేపట్టారు. విజయవాడ నుంచి బదిలీపై ఆయన కోరుకొండ సర్కిల్‌కు వచ్చారు. ఇప్పటి వరకు సీఐగా బాధ్యతలు నిర్వహించిన వై.సత్యకిషోర్ బదిలీ అయ్యారు. నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ మూర్తిని కోరుకొండ, గోకవరం, సీతానగరం ఎస్‌ఐలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉండగా కోరుకొండ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకినాడ జిల్లా పెద్దాపురం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు కోరుకొండ ఎస్‌ఐ బాధ్యతలు నిర్వహించిన ఏవీ నాగార్జున బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్..జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్, డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ సత్యనారాయణ మూర్తిలను మర్యాదపూర్వకంగా కలిశారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మదన్‌సింగ్ పేటకు చెందిన ఎండీ అహీల్ (40) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. అహీల్ మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా తాగి తిరుగుతున్నాడు. అతడికి భార్య, పిల్లలు ఉన్నారు. మంగళవారం ఉదయం భార్యను డబ్బులు అడిగి వాటితో మద్యం తాగి మధ్యాహ్నానికి ఇంటికి వచ్చాడు. మళ్లీ భార్యను మద్యానికి డబ్బులు అడుగగా తన వద్ద లేవని చెప్పి, పొరుగింటికి వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి వచ్చే సరికి అహీల్ ఇంట్లో ఉరివేసుకుని నిర్జీవంగా కనిపించాడు. ఈ మేరకు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మద్యానికి బానిసైన అహీల్‌కు భార్య డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అహీల్ మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

గర్భిణులకు అమృతహస్తం పంపిణీ

సీతానగరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం అమృత హస్తం ప్యాకెట్లు పంపిణీ చేశారు.కాబోయే మాతృమూర్తులు ఆరోగ్యం ఉండాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపట్టినట్టు సమితి సభ్యులు తెలిపారు. 24 మందికి ఈ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, సమితి సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

సీతానగరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని చినకొండేపూడి సొసైటీ అధ్యక్షుడు కాండ్రు శేఖర్ అన్నారు. మంగళవారం గ్రామంలోని ఎంపీపీ మోడల ప్రైమరీ స్కూల్లో జరిగిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యకరమైనవాతావరణం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో స్వామి నాయక్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గోదావరి డెల్టా కాలువలు, డ్రైయిన్ల పరిస్థితిపై లైడార్ సర్వే
రూ.13.4 కోట్లతో హైదరాబాద్‌కు చెందిన ఐఐసీటీతో ఒప్పందం.. మే నెలలోపు రిపోర్టు
ఇరిగేషన్ అధికార్లతో మంత్రి నిమ్మల సమీక్ష 7



దిగజారిన కొబ్బరి ధర!

ప్రస్తుత ధర రూ.10
దిగుబడులూ అంతే

పెరవలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొబ్బరి ధర దిగజారడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరకాలంగా పెరుగుతూ వచ్చిన కొబ్బరి ధర ఒక్కసారిగా సగానికి సగం పడిపోయిందని వాపోతున్నారు. రెండు సంవత్సరాల కిందట కేవలం ఐదారు రూపాయలు మాత్రమే పలికిన కొబ్బరి ధర క్రమంగా పెరుగుతూ పది రూపాయలకు చేరుకుంది. అక్కడి నుంచి ప్రతీ రెండు నెలలకు నాలుగు రూపాయల చొప్పున పెరుగుతూ రూ.20 వరకు వెళ్లింది. అంతేగాకుండా వ్యాపారులు రైతుల చెట్ల వద్దకు వచ్చి వారే స్వయంగా ఖర్చులు భరించి కొబ్బరికాయలు దించుకుని రైతులకు సొమ్ములు చెల్లించేవారు. అయితే కొద్దిరోజులుగా 20 రూపాయలు ఉన్న ధర ఒక్కసారిగా పది రూపాయలు దిగజారిందని రైతులు వాపోతున్నారు. దీంతో నిల్వలుపెట్టిన వ్యాపారులు కూడా లక్ష రూపాయలు మేర నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రేటు బాగుండి కాయలు దిగుబడి కూడా ఉండేదని, ప్రస్తుతం రేటు తగ్గడమేకాకుండా కొబ్బరికాయల దిగుబడి కూడా తగ్గిపోయిందని చెబుతున్నారు. ఎకరానికి 1500 కాయలుపైగా పడేవని ప్రస్తుతం ఏడెనిమిది వందలు మాత్రమే పడుతున్నాయని పేర్కొంటున్నారు. ప్రస్తుతం పెద్దగా శుభకార్యాలు లేకపోవడం, పండుగలు లేకపోవడం దీనికి కారణంగా చెబుతున్నారు. వచ్చే సంక్రాంతి, శివరాత్రి నాటికి తిరిగి కొద్ది మేర అయినా ధర పెరగొచ్చని చెబుతున్నారు.



పెరవలి మండలం తీపర్రు వద్ద బోల్తా పడిన స్కూలు బస్సు

8 **బోల్తా పడిన స్కూలు బస్సు**
విద్యార్థులకు స్వల్పగాయాలు.. తృటిలో తప్పిన ప్రమాదం

ఇంత 'చిన్న' చూపేంటి?



గోదావరి జిల్లాలో నీరు పుష్కలంగా ఉంటుందనేది చాలామంది అభిప్రాయం. కానీ ఇక్కడా మెట్ట ప్రాంతం ఉంది. అటు కాలువల నీరూ, ఇటు బోరు నీరు కూడా లభ్యంకాని పొలాలు వేలాది హెక్టార్లలో ఉన్నాయి. వీటిని సాగు చేయడానికి గతంలో ఏర్పాటుచేసిన చిన్న నీటిపారుదల వ్యవస్థ నిర్వీర్యమై పోయింది. ముఖ్యంగా గత వైసీపీ హయాంలో పైసా విదల్చలేదు. దీంతో మొత్తం చిన్న నీటిపారుదల వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తమైపోయింది. దీన్ని సరిదిద్ది, ఆయా ఎత్తిపోతల పథకాలకు జీవం పోసేందుకు ప్రభుత్వం దృష్టిపెట్టింది. అయితే అవి ప్రతిపాదనల దశ దాటకపోవడం అన్నదాతలకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది.



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కాలువల ద్వారా నీటి సరఫరా లేని మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యవసాయం చేయడంకోసం 1974లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల సంస్థ (ఏపీఐడీ) ఏర్పడింది. ఇది ప్రధానంగా ఎత్తిపోతల పథకాల ఏర్పాటు, నిర్వహణ కోసం పనిచేస్తోంది. కనీసం 50 ఎకరాల నుంచి 5 వేల ఎకరాల వరకూ ఉన్న భూముల కోసం ప్రభుత్వం ఒక్కొక్క ఎత్తిపోతల పథకం నిర్మించి రైతులకు అప్పగించింది. ముఖ్యంగా గోదావరి, కాల్వలు, డ్రైన్ల నుంచి నీటిని ఎత్తిపోసి పంటలు పండించడానికి చిన్నచిన్న ఎత్తిపోతల పథకాలను నిర్మించింది. వాటికి ఉచిత కరెంట్ ఇచ్చేది. ఇక వాటి నిర్వహణ, తూడు, డీసిల్టేషన్, చిన్నచిన్న రిపేర్లు వంటివి రైతులు చేసుకోవాలి. దీనికోసం 11 మందితో రైతు కమిటీ ఉంటుంది. రైతుల నుంచి ఎకరాకు రూ.500 నుంచి 1000 వరకూ ఏడాదికి వసూలుచేసి ఎత్తిపోతల పథకాలను మెయింటెనెన్స్ చేస్తారు. పూర్తి మరమ్మతులు వస్తే ప్రభుత్వమే బాగు చేయిస్తుంది. పదేళ్ల నుంచి పాలకులు వీటిపై పెద్దగా దృష్టి పెట్టలేదు. నిర్వహణకు ఇబ్బంది లేకుండా కొంత సాయం అందించి చేతులు దులిపేసుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వీటికోసం పైసా విదల్చలేదు. దాంతో కొన్ని ఎత్తిపోతల పథకాలు మూతపడ్డాయి. మరమ్మతులు లేక ఆ ఎత్తిపోతల ఆయకట్టులో సాగు నిలిచిపోయింది.

ఎక్కడెక్కడ.. పంపింగ్ స్కీములెన్ని..

మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో చిన్న, మధ్యతరహా ఎత్తిపోతల పథకాలు గోదావరి జిల్లాల్లో పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 101 పంపింగ్ స్కీమ్‌లుండగా, వాటి పరిధిలో 37,450 ఎకరాల ఆయకట్టు ఉండేది. దీంట్లో పోలవరం ప్రాజెక్టు ముంపు వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో 50 ఎత్తిపోతల పథకాలు పనిచేయకుండాపోగా, మరో 20 ఎత్తిపోతల పథకాలు నిర్వీర్యమయ్యాయి. కొంతకాలం వీటిని మైక్రో ఇరిగేషన్ డెవలప్మెంట్ సంస్థ తన అధీనంలో నిర్వహించినా, ఏజెన్సీ ప్రజల్లో స్పందన లేదనే కారణంతో ఇది కూడా వదిలేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 35 స్కీమ్‌లు ఉండగా, అందులో ఆరింటింటిని మొత్తం తొలగించారు. ఇక 29 స్కీమ్‌ల కింద 55,113 ఎకరాల ఆయకట్టు ఉంది. అందులో కొన్ని ఎకరాలకు మాత్రమే నీటిసరఫరా అవుతోంది. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో కాటవరం, కుమారదేవం, వేగేశ్వ రపురం, పైడిమెట్ట, చాగల్లు బ్రాహ్మణగూడెం వంటివి మాత్రం ఓ మాదిరిగా పనిచేస్తున్నాయి. వేములవాడ -1,2, పెదపూడి, పల్లిపాలెం-1,2, పనిచేస్తున్నాయి. మిగతా ప్రాంతాల్లో రిపేర్లకు గత పదేళ్ల నుంచి పాలకులు నిధులు ఇవ్వకపో వడంతో ఎక్కడివక్కడ చతికిలపడ్డాయి. 2016లో తెలుగుదేశం ప్రభుత్వం ఈ వ్యవస్థ బతికించడానికి కొంత ప్రయత్నం చేసింది. కొత్త ఎత్తిపోతల పథకాలను కూడా ప్రతిపాదించింది. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ వీటి విషయం పూర్తిగా పక్కన పెట్టేసింది. రైతుల చొరవ వల్ల నామమాత్రంగా కొన్ని ఉనికిని కాపాడుకుంటున్నాయి. ఇటీవల రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపినప్పటికీ మొల్లేరు- గోవిందపురం- మల్లవరం స్కీమ్ పనులు ఇంతవరకు చేపట్టలేదు. ఇది కొత్త స్కీమ్. గతంలో 22 శాతం పని జరిగి ఆగింది.

- ఉమ్మడి జిల్లాల్లో చిన్ననీటి పారుదల వ్యవస్థ నిర్వీర్యం
- పదేళ్లుగా రిపేర్లకూ నిధులివ్వని వైనం
- ఏజెన్సీ ఎత్తిపోతల పథకాలన్నీ దాదాపుగా మూత
- నిర్వహణ బాధ్యత కార్పొరేట్‌కు అప్పగించే యోచన
- ఇప్పటికే రూ.600 కోట్లతో ప్రతిపాదనలు
- ఇది అమలైతే వేల ఎకరాలకు పుష్కలంగా సాగునీరు
- అయినా రోజులు గడుస్తున్నా ముందుకు కదలని వైనం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో పది చిన్నఎత్తిపోతల పథకాలు ఉండగా, ఇవి పాక్షికంగా పనిచేస్తున్నాయి. అందులో కొవ్వూరు నియోజకవర్గంలో కుమారదేవం, బ్రాహ్మణగూడెం, చాగల్లు, వేగేశ్వరపురం, పైడిమెట్ట-1, నిడదవోలు స్కీమ్‌లు ఉండగా అనపర్తిలో పి.బి.దేవం-1,2, కాపవరం, రాజానగరం నియోజకవర్గంలోని కాటవరం ఉన్నాయి. ఇక్కడ మొత్తం 23,745 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి రిపేర్లకు రూ.4815.50 లక్షలు. నిర్వహణకు రూ.14745 లక్షలు.. మొత్తం రూ.195 కోట్ల 60 లక్షల 50 వేలతో అంచనాలు పంపించారు. కాకినాడ జిల్లాలో అత్యధికంగా 14 స్కీమ్‌లు ఉన్నాయి. వాటిలో పెద్దాపురం నియోజకవర్గంలోని వేట్లపాలెం, కట్టమూరు, కట్టమూరు మినీ, పెద్దాపురం-1, పెద్దాపురం-2, జి.మేడపాడు, పెదబ్రహ్మదేవం-3, కాకినాడ రూరల్‌లో వేములవాడ-2, పెద్దపురపాడు, గొర్రిపూడి, వేములవాడ- అనపర్తి నియోజకవర్గం పరిధిలోని పెదపూడి, దోమాడ, జగ్గంపేట నియోజకవర్గంలోని సోమవరం పథకాలున్నాయి. ఇక్కడ 13,710 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి రిపేర్లు, నిర్వహణకు రూ.122 కోట్ల 25 లక్షల 32 వేలు అంచనా వేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5 పథకాలు ఉన్నాయి. అవి రాజోలు నియోజవర్గంలోని చింతలమోరి, కొత్తపేట నియోజకవర్గంలోని వసంతవాడ, ఉచ్చిలి పథకాలు. ఇక్కడ మొత్తం 4,970 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి రిపేర్లు, నిర్వహణకు రూ.34 కోట్ల 8 లక్షల 37 వేలతో అంచనాలు సిద్ధంచేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పల్లిపాలెం-1,2 పథకాల్లో 927 ఎకరాల అయకట్టు ఉంది. రిపేర్లు, మెయింటెనెన్స్ కోసం రూ.3 కోట్ల 48 లక్షలతో అంచనాలు సిద్ధం చేశారు.

● 49 స్కీమ్‌లు.. రూ.600 కోట్లు

తెలంగాణలో కాకతీయ మిషన్ మాదిరిగా ఓ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థకు మరమ్మతులు, నిర్వహణ బాధ్యత అప్పగించే ఆలోచన ప్రభుత్వం వద్ద ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే వీటి మరమ్మతులకు సంబంధించి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని మొత్తం ఎత్తిపోతల పథకాలను వదిలేసి,మెట్ట ప్రాంతంలోని ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులతోపాటు ఐదేళ్లపాటు నిర్వహణ చేయడానికి ఓ కార్పొరేట్ సంస్థకు అప్పగించే విధంగా ప్రతిపాదనలు సిద్ధచేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 49 ఎత్తిపోతల పథకాలకు మొత్తం రూ.600 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు.





విభిన్న ప్రతిభావంతులకు క్రీడల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి.. తొలుత పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నగర కమిషనర్ రాహుల్ మీనా

విభిన్న ప్రతిభావంతుల్లో అపారమైన సృజనాత్మకత

క్రీడా పోటీల బహుమతి ప్రదానోత్సవ సభలో కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లల్లో అపారమైన సృజనాత్మకత, ప్రత్యేక కౌశలాలు దాగి ఉంటాయని, వారికి సరైన వేదిక, తగిన అవకాశాలు కల్పిస్తే ఏ స్థాయి విజయాలనైనా అందుకుంటారని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విభిన్న ప్రతిభావంతులకు క్రీడలు నిర్వహించారు. ఈ పోటీలను ఉదయం నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా జెండా ఊపి ప్రారంభించగా, సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో నమ్మకం, ధైర్యం, ప్రతిభను వెలికితీయడంలో క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, శిక్షణ, మార్గదర్శకతను అవగాహనతో వినియోగించుకోవాలని సూచించారు. శారీరక పరిమితులు ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో ప్రయత్నం చేయడం నిజమైన బలం, పోటీల్లో పాల్గొనడం నిజమైన విజయం అని పేర్కొన్నారు. కమిషనర్ రాహుల్‌మీనా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలకు అండగా నిలుస్తాయన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు మాట్లాడారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రబీ సీజన్‌కు ఎరువుల కొరతలేదు

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సీజన్ మొదలైందని, ఎరువుల కొరతలేదని, పుష్కలంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రబీలో మొత్తం 60వేల హెక్టార్లలో వరి పంట సాగుకు ప్రణాళిక రూపొందించామని, సుమారు 40 వాతం వెదజల్లే విధానంలో సాగు ఉంటుందన్నారు. ఇప్పటివరకూ రాజానగరం మండలంలో 70 హెక్టార్లలోనూ, కొవ్వూరు డివిజన్‌లోనూ నారుమళ్లు వేసినట్టు చెప్పారు. రబీ పంటల కోసం జిల్లాలో అన్ని రకాల ఎరువులు కలిపి 1,15,000 మెట్రిక్ టన్నులు అవసరం కాగా, ఇప్పటివరకూ 37 వేల మెట్రిక్ టన్నులు సరఫరా చేసినట్టు తెలిపారు. యూరియా 16 వేలు మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా, ప్రస్తుతం 8వేలు మెట్రిక్ టన్నులు అందుబాటు ఉందని, రైతులకు ఎలాంటి ఇబ్బందిరాకుండా నిల్వ చేసినట్టు తెలిపారు. విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నట్టు చెప్పారు.



నిడదవోలు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి : జిల్లా ఎస్పీ

నిడదవోలు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో తనిఖీలు

నిడదవోలు, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు అధికారులు సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించాలని, ఎక్కడైనా పోలీస్ స్టేషన్లో ఎవరైనా అవినీతికి పాల్పడితే తమ దృష్టికి తీసుకువస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన తనిఖీ నిర్వహించారు. ముందుగా పోలీసు వందనం స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో రాజమండ్రి నిడదవోలు, కొవ్వూరులలో రాత్రివేళలో గస్తీ పెంచామని, దీనిద్వారా దొంగతనాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. పట్టణ ప్రాంతాల్లో బ్లూ కోర్ట్ వాహనాలు మరిన్ని కేటాయిస్తున్నామన్నారు. జిల్లాకు త్వరలో శిక్షణ ముగించుకుని కానిస్టేబుళ్లు రానున్నారని, దీంతో సిబ్బంది కొరత తగ్గుతుందని తెలిపారు. జిల్లాలో లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం పై పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలను చైతన్యపరచవలసిన బాధ్యత ఉందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం వినియోగంపై ప్రజలు అవగాహన కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెరవలి హైవేపై ఎదురు వచ్చే ద్విచక్ర వాహనాల ద్వారా ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించామని, వీటి నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. నిడదవోలు పట్టణ పరిధిలో మరిన్ని సీసీ కెమెరాలు పెంచడం, వాటిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు, జిల్లా కంట్రోల్ రూమ్‌కు అనుసంధానానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట డీఎస్పీ జి.దేవకుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ ఉన్నారు.

స్పార్క్ కార్యక్రమంతో ఆవిష్కర్తలకు దిశానిర్దేశం

- జేసీ మేఘస్వరూప్
- ఆర్టీఐహెచ్‌లో ప్రారంభమైన బూట్ క్యాంప్ కార్యక్రమం



ఆర్‌టీఐహెచ్‌లో స్టార్టప్ ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ మేఘస్వరూప్

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): బొమ్మూరులోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ మూడురోజులపాటు నిర్వహించే స్పార్క్ (స్పెషలైజ్డ్ ప్రోగ్రామ్ ఫర్ అడ్వాన్స్‌డ్ అండ్ రియల్‌టైమ్ నాలెడ్జ్) కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ మేఘస్వరూప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 9 నుంచి 12 వరకు ఏర్పాటుచేసిన ఈ బూట్ క్యాంప్ యువతలో ఆవిష్కరణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కారం, స్టార్టప్ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా రూపొందించబడిందన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ అన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి, రతన్‌టాటా ఇన్నోవేటివ్ హబ్ దృష్టికోణానికి. స్పార్క్ కార్యక్రమం కీలక వేదికగా నిలుస్తుందన్నారు. సమస్యలు గుర్తించడం నుంచి ప్రొటో టైప్ అభివృద్ధి వరకు యువతకు మార్గ నిర్దేశం చేసే సామర్థ్యం ఈ కార్యక్రమానికి ఉందన్నారు. తొలి సెషన్‌లో సమస్య నిర్వచనం, కస్టమర్ సెగ్మెంట్ల గుర్తింపు, ప్రాక్టికల్ సొల్యూషన్లు, బ్రెయిన్ స్టార్మింగ్ అంశాలపై చర్చ జరిగింది. కార్యక్రమ లక్ష్యాలు, దిశా దృక్పథం, ఆవిష్కరణల అవకాశాలను ఆర్‌టీఐహెచ్ నోడల్ అధికారి టి సూర్యప్రకాష్ వివరించారు. రీజనల్ సెంటర్ పరిధిలోని స్టార్టప్ ప్రతినిధులు పాల్గొన్నారు.



దేవదాయశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

దేవాలయాల అభివృద్ధికి రూ. 23 కోట్ల నిధులు మంజూరుచేయాలి : ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి రూ.23 కోట్ల నిధులు మంజూరుచేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం విజయవాడ గొల్లపూడిలో దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్‌ను కలిసి దేవాలయాల అభివృద్ధికి సంబంధించి తయారుచేసిన ప్రతిపాదనలను అందజేశారు. రానున్న గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి వచ్చే యాత్రికులు, భక్తుల సౌకర్యార్థం కొవ్వూరు పట్టణంలో దేవాలయాల పునఃనిర్మాణం, ప్రహరీలు, కాటేజీలు, రూమ్‌లు, గాలి గోపురాలు, రూఫ్, ఫ్లోరింగ్, ప్రదక్షిణ మండపాలు, విద్యుదీకరణ పనుల ప్రతిపాదనలకు సుమారు రూ.23 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ చీఫ్ ఇంజనీరు నెహ్రూని కలిసి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని పాల్గొన్నారు.

మదన గోపాలస్వామి ఆలయ ట్రస్టు బోర్డు ప్రమాణం



ఆలయంలో ప్రమాణస్వీకారం చేసిన నూతన బోర్డు సభ్యులు

నిడదవోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసి ఉన్న మదన గోపాలస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు అధ్యక్ష, సభ్యుల ప్రమాణ స్వీకారం ఆలయ ఆవరణలో మంగళవారం జరిగింది. దీనికి దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారి బీఎల్ లక్ష్మీనారాయణరావు అధ్యక్షత వహించారు. అధ్యక్షుడిగా తీర్దాల రామచంద్ర రావు, బోర్డు సభ్యులుగా కే. స్వరూపరాణి, చామర్తి శ్రీనివాస్, కే.సూర్యకాంతం, ఎన్.రమేష్ కుమార్, ఎస్. సత్యవేణి, ఎస్. రామారావు, ఎన్. నాగమణి, వీజేపీ దుర్గా ఆదిశేషు, ఎక్స్ అఫిషియో సభ్యునిగా గోవర్దన దుర్గాప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి నామా సూర్యప్రకాశ రావు, జనసేన పార్టీ అధ్యక్షులు రంగా రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు మోర్తా ప్రమోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు



యాత్రా స్పెషల్ బస్సును పంపిస్తున్న దృశ్యం

కొవ్వూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి శబరిమలకు ప్రత్యేక సర్వీసులు పంపిస్తున్నట్టు డిపో మేనేజర్ ఎన్ఎ నాయక్ తెలిపారు. మంగళశారం వేములూరు నుంచి నక్కా శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములను శబరిమల పంపించారు.ఈ యాత్రా స్పెషల్ బస్సు కొవ్వూరు నుంచి శ్రీశైలం, మహానంది, అరుణాచలం, పళని, ఆదియోగి, ఎరుమేళి, పంబ మీదుగా వెళ్తుందన్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో త్రివేంద్రం, కన్యాకుమారి, రామేశ్వరం, ధనుస్కోటి, మధురై, శ్రీరంగం, కాణిపాకం, విజయవాడ క్షేత్రాల మీదుగా ఈనెల 15వ తేదీ నాటికి వేములూరు చేరుకుంటుందన్నారు. అయ్యప్పలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి : యూటీఎఫ్



కొవ్వూరులో నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

కొవ్వూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ మేరకు మంగళవారం యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.జయకర్ ఆధ్వర్యంలో స్థానిక సంస్కృత పాఠశాల నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ఉపాధ్యాయులంతా కలిసి ర్యాలీగా వచ్చారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. తర్వాత ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.శ్రీనివాస్, డి.మనోజ్ కుమార్, సీహెచ్ మనోహర్, ఎస్.భవన్, ఎండీ ఇమ్రాన్‌బాషా, ఆర్.సురేష్‌కుమార్, రవివర్మ, ఐ.శ్రీనివాస్, రవికుమార్, కె.ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



పెద్దేవం హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రామకృష్ణ

తాళ్లపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో ఎస్‌ఐ తోట రామకృష్ణ ఆధ్వర్యంలో ఆయన సూచనల మేరకు శక్తి టీం ఆధ్వర్యంలో మంగళవారం పెద్దేవం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో శక్తి యాప్, 112 ఎమర్జెన్సీ సేవలు, సైబర్ నేరాలు, పోక్సో చట్టం గురించి, బాలికలకు గుడ్ టచ్ బాడ్ టచ్‌ల గురించి, సెల్ఫ్ డిఫెన్స్ వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శక్తి టీం ఏఎస్‌ఐ గంగాధర్, మహిళా పోలీసులు వరలక్ష్మి, పద్మావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర, విద్యార్థులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా
- సురక్షితంగా బయటపడిన 40 మంది చిన్నారులు
- పెరవలి మండలం తీపర్రులో ఘటన



బోల్తా పడిన స్కూల్ బస్సు, ప్రమాదంలో గాయపడిన మహిళ

పెరవలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రైవేటు స్కూలు బస్సు బోల్తా కొట్టగా విద్యార్థులు స్వల్పగాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. తాడిపర్రులోని జ్యోతి స్కూల్‌కు చెందిన బస్సు కానూరు అగ్రహారం ఉసులుమర్రులో విద్యార్థులను ఎక్కించుకుని తీపర్రులో పిల్లలను ఎక్కించుకునేందుకు వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో గోదావరి ఏటి గట్టుపై మలుపు తిప్పుకునేందుకు రాగా, మలుపు తిప్పే క్రమంలో గోదావరి వైపు అప్రోచ్ రోడ్డు దాటి రివర్స్‌లో కొద్దిమేర దిగిపోయింది. దీంతో బ్రేకులు ఫెయిలై బస్సు ముందుకు రాకుండా వెనక్కి కదిలింది. దీంతో డ్రైవర్ కొద్దిమేర స్టీరింగ్‌ను కంట్రోల్ చేసినప్పటికీ అప్రోచ్ రోడ్డు సగం పైగా దూరం వెళ్లిన బస్సు అనంతరం పక్కకు తిరగబడిపోయింది. దీంతో బస్సులో ఉన్న 40 మంది పిల్లలు భయంతో కేకలు వేశారు. బస్సు ముందుభాగంలోని అద్దం ఊడిపడడంతో అందులో నుంచి పిల్లలందరూ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఆయాగా పని చేస్తున్న మహిళకు కూడా గాయాలయ్యాయి. గాయాలైన వారికి స్థానికులు సపర్యలు చేశారు. సంఘటన తెలిసిన వెంటనే పిల్లల తల్లిదండ్రులు, ప్రజలు సంఘటనా స్థలానికి వచ్చారు. కొంతమందిని తణుకు ఆసుపత్రికి తీసుకెళ్లారు. తీపర్రుకు చెందిన ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, కుందుల భూపతిరావు, తాడిపర్రు సర్పంచ్ కరు టూరి నరేంద్ర ఘటనా స్థలంలో సహాయ సహకారాలు అందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లేని బస్సులను తిప్పుతూ పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆందోళన చెందారు.



విద్యార్థులకు సాయం చేస్తున్న స్థానికులు

మంత్రి దుర్గేష్ ఆరా

ఈ ఘటనపై మంత్రి కందుల దుర్గేష్ ఆరా తీశారు. స్థానిక నాయకుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పాఠశాల యాజమాన్యం, అధికారులతో మాట్లాడారు. గాయపడిన చిన్నారులకు తక్షణం వైద్య సదుపాయం అందించాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా బస్సులు లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని స్కూలు యాజమాన్యాలను హెచ్చరించారు. పిల్లల తల్లిదండ్రులు కూడా లోపాలను గుర్తించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని మంత్రి సూచించారు.

సాగు నీరందించడం సంతోషంగా ఉంది

- పెండ్యాల పంపింగ్ స్కీమ్ ద్వారా నీటిని విడుదల చేసిన మంత్రి కందుల దుర్గేష్
- హర్షం వ్యక్తం చేసిన రైతాంగం



విజ్జేశ్వరంలో స్విచ్చాన్ చేస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి సాగు నీరందించడం సంతోషంగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం విజ్జేశ్వరంలోని పెండ్యాల పంపింగ్ స్కీమ్ ద్వారా మోటారు స్విచ్చాన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెండ్యాల పంపింగ్ స్కీం ద్వారా అన్నదాతలకు సాగునీటిని విడుదల చేశామన్నారు. ఇప్పటికే మరమ్మతుల ఖర్చుల నిమిత్తం నిధులు విడుదల చేయాలని కోరుతూ మంత్రి నిమ్మల రామానాయుడుకు సాగునీటి సంఘం రాసిన లేఖను అందించానని గుర్తుచేశారు. ఇందుకు దాదాపు రూ. 7.5 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. ఈ విషయమై ఇప్పటికే కమాండ్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (కాడా)తో మాట్లాడామని, అక్కడి నుంచి అనుమతి రావా ల్సి ఉందన్నారు. గతంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేసి ప్రస్తుతం రీహాబి లిటేషన్ అండ్ రీసెటిల్మెంట్ (ఆర్అండ్ఆర్)లో విధులు నిర్వర్తిస్తున్న ప్రశాంతితో ఈ అంశంపై మాట్లాడానని చెప్పారు. ఈ అంశాన్ని ఆమె ఫాలప్ చేస్తున్నట్టుగా మంత్రి వివరించారు. త్వరలోనే శుభవార్త వింటామన్నారు. స్థానిక అధికారులు ఈ విషయంపై మరింత శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నామా శ్రీనివాస్ నూతన నియామకం

తాళ్లపూడి, డిసెంబరు 9 (అంధ్రజోతి): తాడిపూడి గ్రామ సర్పంచ్, సాయిస్ఫూర్తి హాస్పటల్స్ ఎండీ నామా శ్రీనివాస్ (గోపాలం) నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మెడికల్ విభాగ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు ఉత్తర్వులు అందుకున్నారు. దీంతో మంగళవారం పలువురు సర్పంచులు, శ్రీసాయిస్ఫూర్తి హాస్పటల్ సీఈవో గూడా విజయరాజు, లింగంపల్లి సుధీర్, హాస్పటల్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



మహిళలను పరీక్షిస్తున్న డాక్టర్ అమృత

పెరవలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. తణుకుకి చెందిన రత్న నర్సింగ్ హోమ్ డాక్టర్ అమృత వచ్చి ఆయాగ్రామాల నుంచి వచ్చిన 28 మందికి వైద్యసేవలందించారు. ఆమెకు డాక్టర్ రాజనాల ప్రసాద్ సహకరించారు.

క్రైస్తవ మందిరాలపై దాడులకు పాల్పడడం సరికాదు

కొవ్వూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాచారాల పేరుతో క్రైస్తవ మందిరాలపై దాడులకు పాల్పడడం సరికాదని క్రిస్టియన్ సేవాసంఘ్ జాతీయ కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ అన్నారు. పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులో ఆదివారం క్రైస్తవ ప్రార్థనా మందిరాన్ని మూసివేయడాన్ని ఖండించారు. ఆర్టికల్ 25 ప్రకారం రాజ్యాంగంలో మత స్వేచ్ఛ హక్కును కల్పించడం జరిగిందన్నారు. సనాతన ధర్మం పేరుతో ఆర్ఎస్ఎస్ వాదులు పాల్గొన్నారన్నారు. మూసివేసిన ప్రార్థనా మందిరాన్ని తెరిపించాలన్నారు.

సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలు



నిడదవోలులో వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నిడదవోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ జాతీయ నేత సోనియాగాంధీ పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి భద్రం దొర కేకు కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే దేశం అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో చిన్నం మురళీకృష్ణ, భావన రమేష్, పుచ్చకాయల ప్రసాద్, కాకికిషోర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



జాలాది మౌనిక

చాగల్లు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చాగల్లు విద్యార్థి జాలాది మౌనిక జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఈమె జాతీయ స్థాయి జూనియర్స్ విభాగంలో వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. బుధవారం నుంచి విశాఖపట్నంలో జరిగే శిక్షణలో పాల్గొననుంది. రాజస్థాన్‌లో జరిగే జాతీయ పోటీల్లో ఆమె పాల్గొంటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.పావని, కళాశాల అధ్యాపక బృందం, తదితరులు అభినందనలు తెలిపారు.

సారా బట్టీలపై పోలీసుల దాడి



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది

తాళ్లపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తుపాకులగూడెం సరిహద్దు ప్రాంతంలోని సారా బట్టీలపై మంగళవారం ఎస్‌ఐ రామకృష్ణ తమ సిబ్బందితో దాడి చేశారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు 400 లీటర్ల బెల్లపు ఊట కలిగి ఉన్న డ్రమ్ములను ధ్వంసం చేశారు.దాడిలో ఎస్‌ఐ టి. రామకృష్ణ, సిబ్బంది ఫణికుమార్, సురేష్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి నుంచి లారీల లోడింగ్, అన్లోడింగ్ నిలిపివేత

నిడదవోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ సత్యనారాయణ లారీ ఓనర్స్ అసోసియేషన్ మంగళవారం అర్ధరాత్రి నుంచి రైల్వే గూడ్స్ షెడ్డులో లోడింగ్, అన్లోడింగ్ నిలిపి వేస్తున్నట్టు ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫిట్నెస్ టెస్టింగ్ ఫీజును భారీగా పెంచడంతో 15 సంవత్సరాలు పైబడిన లారీల యజమానులు భారీగా నష్టపోతున్నారని, దీంతో వారికి ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఫిట్నెస్ టెస్టింగ్ ఫీజును తగ్గించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు రైల్వే గూడ్స్‌షెడ్డులో లోడింగ్, అన్‌లోడింగ్‌ను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

వైసీపీ ర్యాలీకి తరలిరండి

నల్లజర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్వీకరించిన కోటి సంతకాల పత్రాలను ర్యాలీగా తరలించేందుకు బుధవారం చేపట్టిన ర్యాలీకి నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘ అధ్యక్షులు నల్లజర్ల మండల పార్టీ అధ్యక్షుడు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం ఇంటికి తరలి రావాలని మాజీ హోం మంత్రి తానేటి వనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యం ఇంటి నుంచి అనంతపల్లి టోల్‌ప్లాజా వరకు ర్యాలీ సాగుతుందన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ



బ్యానర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కొవ్వూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐ.పంగిడిలో మంగళవారం హిందూ సమ్మేళనం కరపత్రాలు పంపిణీ చేశారు. ఆర్ఎస్ఎస్ కొవ్వూరు ఖండ కుమారదేవం ఉప మండలానికి చెందిన పంగిడి రామాలయం వద్ద కెవిడి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన హిందూ సమ్మేళనం కరపత్రాలు, పోస్టరు గ్రామస్థులతో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జి.శ్రీనివాసమూర్తి, జి.శ్రీహరి, వి.రామమోహన్, తదితరులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై అవగాహన

దేవరపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గౌరీపట్నం వైద్యాధికారి డాక్టర్ మౌనిక పేర్కొన్నారు. మంగళవారం గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఈ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జే.సతీశ్, హెల్త్ సూపర్‌వైజర్ ఏ.శ్రీకృష్ణుడు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హెచ్ఎస్ వర్దన్, ఎంఎల్‌హెచ్‌పీ ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

'పోటీ ప్రపంచంలో ఏఐదే కీలకపాత్ర'



ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ శ్రీనివాస్ చక్రవర్తి

కొవ్వూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక యుగంలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ప్రతిరంగంలో కీలకపాత్ర పోషిస్తుందని ఏఐ, ప్రామ్‌టు ఇంజనీరింగ్ నిపుణుడు, ప్రొఫెసర్ నెక్కంటి శ్రీనివాస్ చక్రవర్తి అన్నారు. పట్టణంలోని అల్లూరి బాపినీడు,పెండ్యాల రంగారావు డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మంగళవారం ఆర్టిఫీ షియల్ ఇంటిలిజెన్స్‌పై రెండురోజుల వర్క్‌షాప్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డా.రామ్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ చక్రవర్తి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, ప్రాంప్ట్ ఇంజనీరింగ్ (ఏఐ) మోడల్‌ల నుంచి అత్యంత ఖచ్చితమైన, ఉప యోగకరమైన, నాణ్యమైన ఫలితాలు పొందడానికి మనం ఇచ్చే ప్రశ్నలు, సూచనలను ప్రాంప్ట్ మెరుగుపర్చే ప్రక్రియ అన్నారు. సరైన ప్రాంప్ట్ ఇస్తే ఏఐ నుంచి వచ్చేసమాధానం స్పష్టంగా, సృజనాత్మకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.వై.రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మండల సర్వసభ్య సమావేశం వాకౌట్

తాళ్లపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గౌరవ వేతనమే కాదు.... కనీసం గౌరవం కూడా లేదని, కూటమినేతలు, అధికారులు సైతం ప్రోటోకాల్ కూడా పాటించడం లేదని ఆరోపిస్తూ ఎంపీటీసీలు, సర్పంచులు సర్వసభ్య సమావేశాన్ని వాకౌట్ చేశారు. మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు అధ్యక్షతన జరిగింది. దీనిపై ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ జడ్పీ సీఈవో దృష్టికి తీసుకుని వెళతానన్నారు.

'వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అందిపుచ్చుకోవాలి'



నెలటూరులో మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జోగినాయుడు

చాగల్లు, డిసెంబరు 9 (అంధ్ర జ్యోతి): రైతులు జీవన విధానంలో సుస్థిరత సాధించడానికి ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ. జోగినాయుడు అన్నారు. మంగళవారం నెలటూరు జిల్లా ఏరువాక కేంద్రం (రాజమహేంద్రవరం), శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం రైతు సభ జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ, నూతన వంగడాలు, డ్రిప్ ఇరిగేషన్, మార్కెటింగ్ పరిజ్ఞానం, అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తులు, ఆర్థిక పరిస్థితులపై కళాశాల విద్యార్థులు, రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్‌వీ నరసింహారావు, మానుకొండ శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివ నాగేంద్ర, టీడీపీ నాయకుడు తాళ్లూరి హరిశ్చంద్రప్రసాద్, ఏడీఏలు సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్. విజయరామ లక్ష్మి, వ్యవసాయ అధికారి వేణుగోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి కూటమి ప్రభుత్వం అండ

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



ప్రభుత్వం నుంచి మంజూరైన ఎల్‌వోసీని శ్రీనుకు అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. నల్లజర్ల మండలం దూబచర్లకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఈడే శ్రీను గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. కాగా, వైద్యులు కిడ్నీ మార్పిడి చేయాలంటూ శ్రీను కుటుంబసభ్యులకు సూచించారు. దీంతో ఆర్థికఇబ్బందులతో కొట్టిమిట్టాడుతున్న బాధిత కుటుంబ సభ్యులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ సీఎంవో ఆఫీసులో దగ్గరుండి మరీ రూ. 8 లక్షలు ఎల్‌వోసీని మంజూరు చేయించారు. మంజూరైన ఎల్‌వోసీ పత్రాన్ని మంగళవారం రాత్రి కుటుంబసభ్యులకు అందజేశారు. దీంతో శ్రీను కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

త్వరలో పోలీస్‌స్టేషన్లకు పూర్తి స్థాయి సిబ్బంది



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహకిశోర్

ఉండ్రాజవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్లకు త్వరలో సిబ్బంది వస్తారని జిల్లా ఎస్పీ డీ. నరసింహ కిశోర్ పేర్కొన్నారు. మంగళవారం ఉండ్రాజవరం పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేస్తూ రికార్డులను పరిశీలించారు. ఈయనతోపాటు డీఎస్పీ దేవకుమార్, సీఐ జీవీజీ తిలక్, ఎస్సై డీ. రవికుమార్, ట్రైనీ ఎస్‌ఐ నవీన్‌కుమార్, సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు ఉన్నారు.

వేతనాలు పెంచాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి



కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కొవ్వూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్‌సీ ప్రకటించి, కార్మికుల వేతనాలు పెంపుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉద్యోగ - కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ సీహెచ్. వెంకటేశ్వర్లుకు కార్మిక సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. సుందరబాబు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ కమిటీని నియమించి, మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు వేతనాలు పెంపుదల చేయాలని, 2025 జులైలో ఇంజనీరింగ్ కార్మికులు పది రోజులు, పారిశుధ్య కార్మికులు ఏడు రోజులు సమ్మెకాలపు వేతనాలు చెల్లించేందుకు జీవో జారీ చేయాలని, 2023 డిసెంబరు 26 నుంచి జనవరి 11 వరకు జరిగిన 17 రోజుల మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘంరెడ్డి వెంకటరమణ, రాజాన అప్పారావు, మీసాల వరలక్ష్మి, కళ్యాణి పద్మ, సంఘంరెడ్డి రమణ, కళ్యాణి శివశంకర్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు కంప్యూటర్ బహూకరణ



బహూకరిస్తున్న నాటక అకాడమీ డైరెక్టర్ అనంతలక్ష్మి

నిడదవోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చదువుకున్న కళాశాలను మరిచిపోకుండా, కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందించడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ బీ.గీతాంజలి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో పూర్వ విద్యార్థిని, రాష్ట్ర నాటకరంగ అకాడమీ డైరెక్టర్ వెలగన దుర్గా అనంతలక్ష్మి తన సొంత నిధులతో కళాశాలకు కంప్యూటర్‌ను అందించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు చిన నరసింహారావు అంత్యక్రియలు

నల్లజర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనంతపల్లి మాజీ సర్పంచ్ గద్దే చిన నరసింహారావు ఆదివారం మృతిచెందిన విషయం తెలిసిందే. ఈమేరకు ఆయన అంత్యక్రియలు గురువారం అనంతపల్లిలో జరపనున్నట్టు బంధువులు తెలిపారు. ఆయన కుమారుడు, కుమార్తె అమెరికాలో నివసిస్తున్నారు. వారి సమక్షంలో జరగనున్నాయి.